

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :20 సంచిక: 6 హైదరాబాద్ నవంబరు 2020 పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# మెహెరాబాద్‌లో బాబా సమాధి

## నవంబరు 19 నుండి ఉ. 7 నుండి 6 వరకూ తెరిచే వుంటుంది



2020 నవంబరు 19 నుండి మెహెరాబాద్‌లో బాబా సమాధి ఉదయం 7 నుండి సాయంత్రం 6 వరకూ ప్రేమికుల కోసం తెరిచే వుంటుంది. ఈ మేరకు మహారాష్ట్ర ప్రభుత్వం తగిన అనుమతి మంజూరు చేసింది. ఐతే సమాధిలోనికి ప్రవేశం అనుమతి లేదు. బాబా ప్రేమికులు అవతారుడిని దూరం నుండి దర్శించుకోవాలని ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, అలాగే సాయంత్రం వేళలలో సమాధి ఎదుట ప్రార్థనలు, ఆరతి వుండవు. ప్రసాదం పంపిణీ వుండదు. పూలహారాలు తీసుకురావద్దని బాబా ట్రస్టు కోరుతోంది. కోవిడ్ 19 నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ, స్థానిక వాలంటీర్లతో సహకరించవల్సిందిగా శ్రీధర్ కేల్కర్ కోరుతున్నారు. ప్రస్తుత పరిస్తితుల్లో, దూరప్రాంతాల నుండి విచ్చేసే ప్రేమికులకు తగిన వసతి ఏర్పాట్లు చేయలేకపోతోందని తెలుస్తోంది.

# జూబ్లి కేంద్ర 34వ వార్షికోత్సవం

## 2020 నవంబరు 15, ఉ. 9 నుండి 1 వరకూ సహవాస్

### కోవిడ్ నిబంధనలు పాటిస్తూ క్యూలో అవతారుని దర్శనం

అవతార్ మెహెర్‌బాబా జూబ్లి కేంద్ర వార్షికోత్సవం 2020 నవంబరు 15, ఆదివారం ఉదయం 9 నుండి 1 గంట వరకూ ఆన్‌లైన్‌లో నిర్వహించారు. జూబ్లిహిల్సు బాబా కేంద్రం బాబా ప్రేమికుల కోసం ఉదయం 9 నుండి తెరిచి వుంది. స్థానిక బాబా ప్రేమికులు బాబా దర్శనం చేసుకున్నారు. శ్రీ గోపాలకృష్ణ (గోపి) బృందం మధురమైన బాబా భజన గీతాలు ఆలాపించారు. కాగా సహవాస్ కార్యక్రమం ఆన్‌లైన్‌లో నిర్వహించగా ప్రేమికులు ఈ కార్యక్రమాన్ని ఎవరి ఇళ్ళలో వారుండి వీక్షించే ఏర్పాటు చేశారు.

## బాబా సందేశం

**To speak well is Good, to think well is better; Above all, to live well is best.**

**నిర్మలమైన పలుకుల కంటె, నిర్మలమైన ఆలోచనలు మంచివి. నిర్మలంగా జీవించడము అన్నిటికంటె ఉత్తమమైనది.**

**- మెహెర్‌బాబా**


గౌరవ సంపాదకులు
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**


**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేదీ లోపల అందేలా పంపవలసింది.**


**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


## లోపలి పేజీలలో...


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | విష్ణు మాస్టర్ | 6-8 |
| 3. | ప్రాక్‌పశ్చిమ సమ్మేళనము | 9-10 |
| 4. | బ్రహ్మైక్యం భూమీదనే సాధ్యం | 11-18 |
| 5. | రెక్కలున్న తెల్లని గుర్రం | 19 |
| 6. | లార్డ్ మెహెర్ | 20-27 |
| 7. | తెలుగు-గుజరాతీ సహవాస్ | 29-33 |
| 8. | కాదంటారా? | 34-35 |
| 9. | మెహెర్‌బాబా ఇష్టపడిన ఫోటో | 36-38 |
| 10. | పశ్చాత్తాప ప్రార్థన | 39 |


## మనవి

**ఈ ప్రచురణలోని రచనలు, అందలి భావాలు సంబంధిత రచయితలవేనని పాఠకులు గమనించగలరు.**

Please visit : www.srimeherbaba.com

# 52వ అమరతిథి

## 2021 జనవరి 30, 31 వర్చ్యువల్ సహవాస్

కోవిడ్ 19 వైరస్ ఇంకా నియంత్రణలోనికి రాని కారణంగా 2021 జనవరి 30, 31 తేదీలలో మెహెరాబాద్ నుండి అవతారుని 52వ అమరతిథి వేడుకలు ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసినట్లు బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అమరతిథి రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనగోరువారు తమ వివరాలను ట్రస్టువారికి అందేలా 2020 డిశెంబరు 10 లోగా అందేలాగా పంపవలెనన్నారు. మరిన్ని వివరాలకు అవతార్ మెహెర్‌బాబా ట్రస్టు వెబ్‌సైట్‌ను దర్శించగలరు. లేదా, **amartithihelpdesk@gmail.com** / 74477-66580 / 74477-66585, సంప్రదించవల్సింది. ముఖ్యంగా, **2021 జనవరి 31న మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకూ** బాబా ప్రేమికులందరూ వారి వీలునిబట్టి, ఆ సమయంలో వారెక్కడున్నా అవతారుని నామస్మరణతో మౌనం పాటించవల్సిందిగా మనవి చేశారు. **"ప్రియతమ మెహెర్‌బాబా ఎప్పుడూ మీతో వుంటాడని, ఆయన నుండి మీరు ఎన్నడూ వేరు కాదని ప్రవచించిన అవతారుని మాటలను", ట్రస్టు చైర్మన్ మరోమారు బాబా ప్రేమికులకు గుర్తుచేశారు.**

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్ నామం ఎక్కువమంది పాఠకులకు అందజేసేందుకు వీలుగా మీ బంధు మిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రికకు వార్షిక, జీవిత సభ్యులుగా చేర్పించండి. మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు. మరిన్ని వివరాలను ప్రతి సంచికలోని పేజి 40 లోగా సవివరంగా తెలియజేయడమైంది లేదా మొబైల్ 99595-53218 సంప్రదించగలరు. మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా ఠంచనుగా 26వ తేదీన పోస్ట్ చేస్తున్నాం. అంతకంటే ముందుగా అంటే ప్రతినెలా 20వ తేదీ కల్లా పత్రికను సిద్ధం చేసి ప్రింటింగ్ కోసం పంపుతూ, మెహెర్‌బాబా పత్రిక పేరిట ప్రారంభించిన వాట్సప్ గ్రూప్‌లో, అలాగే ఇ-మెయిల్ ద్వారా పోస్ట్ చేస్తున్నాం. ప్రింటింగ్ పూర్తయ్యాక సభ్యులందరికి ప్రతినెలా 26 తేదీన పోస్టు చేస్తున్నాం. పత్రిక మీ ఇంటికి 28వ తేదీలోగా తప్పక బట్వాడా అవుతుంది. మీ అడ్రస్సులో మార్పులుంటే తక్షణం మొబైల్ ఫోన్ నంబరు 99595 53218 యస్‌యంయస్ లేదా వాట్సప్ ద్వారా గానీ తెలియజేయవల్సింది.

# సంపాదకీయం ఆన్‌లైన్ సహవాస్‌లు

కరోనా వ్యాధి బారి నుండి యావత్తు మానవాళిని రక్షించమని బాబాను ప్రార్థిస్తూ, 2020 మార్చి నెలాఖరు నుండి అక్టోబరు దాకా తెలుగునాట ప్రతి ఇంటా బాబా ప్రేమికులు అవతారుని నామస్మరణ నిర్విఘ్నంగా నిర్వహించారు. ప్రతిరోజూ రమారమిన 14 గంటలపాటు **"హరే మెహెర్ హరే మెహెర్"** ఏకనామంలో కొన్ని వందల మంది బాబా ప్రేమికులు పాల్గొన్నారు. ప్రతి 30 నిముషాలకు ఒకరు చొప్పున తెల్లవారుఝామున 5 నుండి అర్థరాత్రి 12 దాకా ఈ నిరంతర ఏకనామస్మరణ జరిగింది. కాగా, కొందరు ఇంకా తమ శక్త్యానుసారం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. అలాగే, కొన్ని బాబా కేంద్రాలు స్కైప్, యూట్యూబ్ సహాయంతో వారంలో ఐదారు రోజులు సత్సంగ్ కార్యక్రమాలను ఎవరి ఇళ్ళలో వారుండి నిర్వహిస్తున్నారు. ఇది అభినందనీయం. శుభపరిణామం. ఇటీవల జూబ్లి కేంద్రం, తణుకు, భీమిలి, బాబా కేంద్రాల వార్షికోత్సవాలు కూడా ఆన్‌లైన్‌లో వేడుకగా నిర్వహించారు. ఏలూరు బాబా కేంద్రం 68వ వార్షికోత్సవాన్ని డిశెంబరు 25న జరుపుకునేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఈ సత్సంగ్‌లలో బాబా ప్రేమికులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అంతేకాదు గతంలో ఎన్నడూ పెదవివిప్పని వారు కూడా ఆన్‌లైన్ సహవాస్‌లో అవతారుని సందేశాలపై చక్కని ప్రసంగాలు చేస్తున్నారు. ఐతే, ఆయా పుస్తకాలలో వున్న బాబా సందేశాలను చూసి చదివితే బాగుంటుందని పలువురి అభిప్రాయం.

## అవతారుని అమరతిథి

2021 జనవరి 31న మెహెరాబాద్‌లో అవతారుని అమరతిథి కార్యక్రమం కూడా వర్చ్యువల్‌గానే నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి.
ఈ మేరకు బాబా ట్రస్టు ఒక ప్రకటన కూడా జారీ చేశింది.
కరోనా నిబంధనలు పాటిస్తూ మెహెరాబాద్‌లో నవంబరు 19 నుండి అవతారుని సమాధి దర్శనం ప్రారంభమవుతోంది. జనవరిలో అవతారుని అమరతిథి, అనంతరం ఫిబ్రవరి 25న జరుపుకునే బాబా జన్మదినోత్సవం నాటికి మెహెరాబాద్‌లో బాబా దర్శనం, దేశంలో మరింత మెరుగైన వాతావరణం నెలకొంటుందని ఆశిద్దాం.

***

**2021 జనవరి 31న అవతారుని అమరతిథి రోజున మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకూ బాబా నామస్మరణలో మౌనం పాటించాలని ప్రతిఒక్కరం గుర్తుంచుకుందాం!!.**

# విష్ణు మాస్టర్



**శిష్యుడు సిద్ధంగా వుంటే, గురువు గారు ప్రత్యక్షమౌతారన్నది నానుడి. విష్ణు మాస్టర్ విషయంలో ఇది అక్షరసత్యమయ్యింది. గతజన్మ పుణ్య సంస్కారాల ఫలితమో ఏమో కాని, 1919లో 15 సంవత్సరాల వయస్సులో విష్ణు అవతారుని దరి చేరాడు. నీకు తండ్రిలాంటివాడినని బాబా ఆతనికి అభయమిచ్చారు. ఆశ్రమవాసులకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసే బాధ్యతను విష్ణు తన తుదిశ్వాస వరకూ నిర్వహించాడు. మండలి సభ్యులైన పెండూ, పాద్రి, విష్ణు, ఆదీ సీనియర్‌లను ఫోర్ పిల్లర్స్ ఆఫ్ మెహెరాబాద్‌గా బాబా స్వయంగా ప్రకటించారు. నవజీవన కార్యక్రమంలో పాల్గొన్న విష్ణు ధన్యుడు. సతారా కారు ప్రమాద సమయంలో విష్ణు ఒక్కడే క్షేమంగా బైటపడ్డాడు. ఆ సమయంలో అవతారుని విశ్వరూప దర్శనం పొందిన భాగ్యశాలి. 1962 వేసవిలో గురుప్రసాద్‌లో వుండగా, శ్రీ విష్ణు శాశ్వతంగా అవతారునిలో ఐక్యమయ్యాడు. మరిన్ని వివరాల కోసం ...!!**

***

అది 1919వ సంవత్సరం. పూణే నగరంలో కాస్బాపేటలో మత్స్యకారులు వుండే ప్రాంతంలో విష్ణు తన తల్లితో కలిసి వుండేవాడు. ఇది మెహెర్‌బాబావారి ఇంటి ప్రాంగణానికి దగ్గరగా వుండింది. ఆ రోజుల్లో మెహెర్‌బాబాని ఇంకా మేర్వాన్ అనే పిలుస్తున్నారు. కాస్బాపేటలో, ఒక చిన్న గదిని ఏర్పాటుచేసి, ఓ గుడిలో మాదిరి ప్రతిరోజూ భగవంతుని ప్రార్థనలు, ఆరతులు జపిరి మేర్వాన్ తీర్థప్రసాదాలు ఇచ్చేవాడు. ఆ మాదిరిగా ఆ ప్రాంతంలో చాలామంది మేర్వాన్‌కు శిష్యులుగా చేరువయ్యారు. ఒకరోజున మెహెర్‌బాబా ఒక కుర్రవాడికి ప్రసాదం ఇస్తూ, మీ తండ్రి ఎవరు? ఏం చేస్తుంటాడని ప్రశ్నించారు. తన తండ్రి చిన్నతనంలోనే మరణించాడని, తన తల్లితో కలిసి ఈ గుడికి దగ్గర్లో వుంటున్నామని చెప్పాడు. దాంతో బాబా, చింతించకు.. "నేటి నుండి నేను నీకు తండ్రిలాంటివాడినన్నారు".

ఆ మాదిరిగా విష్ణు గతజన్మ సంస్కారాల ప్రభావంతో
అవతారుడు స్వయంగా ఆ కుర్రవాడిని తన దరిచేర్చుకున్నారు .
ఆ బంధం కడదాకా నిలిచింది. ఓ రోజున విష్ణు తల్లి బాబా దగ్గరకు వచ్చి,
తన కొడుకు చెడు స్నేహాలకు అలవాటు పడ్డాడని చెప్పింది.
ఇంటిపట్టున వుండకుండా ఎక్కువగా సినిమాలకు వెడుతున్నాడని చెప్పింది.
దాంతో బాబా కోపంగా విష్ణుని వెదుక్కుంటూ ప్రక్క వీధిలోనే వున్న సినిమాహాలుకి వెళ్ళి, అక్కడున్న విష్ణుని చూసి రెండు చెంపలూ వాచిపోయేలా కొట్టారు.
"నేను నా సొంత డబ్బులతో టిక్కెట్ కొనుక్కుని సినిమాకు వచ్చానని విష్ణు చెప్పినా,
నాకు చెప్పకుండా సినిమాకు ఎందుకొచ్చావ్? నా అనుమతి తీసుకున్నావా?
నేను నీ తండ్రిలాంటివాడినని చెప్పానా? లేదా? అని గట్టిగా గద్దించారు బాబా.
ఆ రోజు నుండి బాబా అనుమతి  లేకుండా విష్ణు ఏ పని చేయలేదు.
అలా చేయకూడదని కూడా విష్ణు తెలుసుకున్నాడు.
ఆ తర్వాత నాలుగు సంవత్సరాలకు 1923 ప్రాంతంలో మెహెర్‌బాబా ముంబాయిలోని మంజిల్-ఇ-మీంలో వచ్చి చేరమని విష్ణుకి బాబా కబురు చేశారు. ఐతే ఆ మరుసటి సంవత్సరం నుండి బాబా ఆశ్రమంలో మండలి సభ్యునిగా శాశ్వతంగా బాబాతోనే వుండిపోయాడు. ఆ రోజుల్లో బాబా విష్ణుకి మార్కెట్ నుండి ఆశ్రమవాసులకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసి, అందుకైన జమా-ఖర్చులు చూసుకునే బాధ్యతను అప్పగించారు. ఈ బాధ్యతను విష్ణు కడదాకా నిర్వహించాడు.
1929లో బాబావారితోపాటు పర్షియా పర్యటనలో, 1931 ఇంగ్లాండు పర్యటనలోనూ విష్ణు పాల్గొన్నాడు. ఆ తర్వాత అవతారుడు జరిపిన యూరోపు, అమెరికా తదితర పర్యటన సమయంలో విష్ణు మాస్టర్‌కి బాబా ఓ ప్రత్యేక డ్యూటీ అప్పగించారు.
అదేమంటే, బాబా పర్యటనలో వున్న సమయంలో మెహెరాబాద్ మండలివారి యోగక్షేమాలు తెలియజేస్తూ ప్రతిరోజూ ఓ టెలిగ్రాం బాబాకు పంపాలని ఆదేశించారు. ఏదేని కారణంగా విష్ణు నుండి టెలిగ్రాం రావడం ఆలస్యమైతే, బాబానే ఎందుకు తంతి పంపలేదని కారణం చెప్పమంటూ టెలిగ్రాం పంపేవారు.
1920వ దశకం నుండి తుదిశ్వాస వరకూ విష్ణు మాస్టర్ మెహెరాబాద్‌లో వున్నాడు.
మెహెరాబాద్ బాబా ఆశ్రమంలోని నలుగురు ముఖ్యులైన మండలి సభ్యులలో పెండూ, పాద్రి, విష్ణు, ఆదీ సీనియర్‌లను ***Four pillars of Meherabad*** – "మెహెరాబాద్‌కు నాలుగు మూలస్తంభాలాంటి వారని"  1949 ఆగస్టులో మెహెరాబాద్‌లో నిర్వహించిన నవజీవన సమావేశ సమయంలో మెహెర్‌బాబా స్వయంగా వీరిని ప్రశంశించారు.
బాబాతోపాటు నవజీవన కార్యక్రమంలో విష్ణు కూడా పాల్గొన్నాడు.

బాబావారు నెరపిన నవజీవనంలో బాబాతోపాటు 20మంది మెహెరాబాద్ మండలి సభ్యులు పాల్గొన్నారు. వీరు డెహ్రాడూన్‌కి సమీపంలో మంజరీమాఫిలో వున్న సమయంలో విష్ణు మాస్టర్ తల్లి కన్నుమూసింది. ఈ వార్త తెలిసి కూడా నవజీవన నియమాలను పాటిస్తూ, కళ్ళు చెమ్మగిల్లకుండా ధైర్యంగా వున్నాడు.

నవజీవనం కార్యక్రమం ముగిశాక బాబాతో వున్న విష్ణు మాస్టర్ సతారాలో అవతారునికి 1956 డిశెంబరులో జరిగిన కారు ప్రమాద సమయంలో బాబాతోనే వున్నాడు. ఆ రోజున పూణే నుండి సతారాకు వస్తున్న తిరుగు ప్రయాణంలో కారులో విష్ణు కూడా వున్నాడు. ఆ కారు ప్రమాదంలో విష్ణు ఒక్కడే క్షేమంగా బైటపడ్డాడు. మిగిలినవారందరికి తీవ్రంగా గాయాలయ్యాయి.

బాబా మండలి సభ్యుడొకరు అక్కడికక్కడే మరణించారన్న సంగతి పాఠకులకు తెలుసు. ఆనాడు కారు నడుపుతున్న ఏరుచ్‌కి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఏరుచ్‌కి ప్రక్కటెముకలు విరిగి చికిత్స తీసుకున్నాడు. ఈ ప్రమాదానికి గురికాకుండా క్షేమంగా బైటపడిన విష్ణు మాస్టర్‌ని, ఈ ప్రమాదాన్ని చాలా దగ్గర్నుండి నీ కళ్ళారా చూసావ్ కదా!! అసలు ఏం జరిగిందో చెప్పమని ఏరుచ్ విష్ణుని అడిగితే, ఆయన సమాధానం ఇలా వుంది. ప్రమాదం జరిగిన తర్వాత ఆ క్షతగాత్రుల నడుమ వున్న అవతారుడు కోటికాంతులీనుతూ కనిపించాడు. నాకు అవతారుని నిజదివ్య దర్శనం లభించిందని విష్ణు జవాబిచ్చాడు. క్షురుక్షేత్ర సంగ్రామంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఇచ్చిన విశ్వరూప దర్శనం మాదిరి అవతారుడు నాకు తన విశ్వరూపాన్ని సాక్షాత్కరింపజేశారని విష్ణు ఆనాటి మధురక్షణాలను వివరించాడు. 1962లో మెహెర్‌బాబా పూణేలోని గురుప్రసాద్‌లో వున్నారు. ప్రతి సంవత్సరం వేసవికాలంలో బాబా పూణేలోని గురుప్రసాద్‌లో వుండేవారు కదా!!. అలా ఓ రోజున ఆదివారం నాడు బాబా దర్శన కార్యక్రమం పూర్తయ్యాక, బాబా తన గదిలోకి వెళ్ళిపోయారు. ఆ మధ్యాహ్న సమయంలో తీవ్ర గుండెపోటుతో అవతారుని నామంతో విష్ణు తుదిశ్వాస వదిలాడు. ఈ విషయం తెలుసుకుని హుటాహుటిన వచ్చిన అవతారుడు విష్ణు ప్రక్కనే సరిగ్గా ఒక గంట సేపుకు పైగా కూర్చున్నారు. బాబా ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ, నేనింత వరకూ ఎవరి పార్థివదేహం ప్రక్కన ఇంత సమయం గడపలేదని అంటూ విష్ణు ధన్యుడు. ఆతను నాలో ఐక్యమయ్యాడని బాబా ప్రకటించారు. బాబా మండలి సభ్యులలో ఎత్తులో పొట్టిగా వుండే విష్ణు మాస్టర్ అవతారుని సేవలో ఎంతో ఉన్నతుడని బాబా సోదరి మణిజా ఇరాని అభివర్ణించారు. దిగువ మెహెరాబాద్‌లో విష్ణు సమాధి వుంది. ఈ దఫా మెహెరాబాద్ పర్యటనలో తప్పక దర్శించండి. ఈతని ప్రక్కనే డాక్టర్ నీలూ సమాధి వుంది!

***

# ప్రాక్‌పశ్చిమ సమ్మేళనము

## మెహెర్‌బాబా ఇచ్చిన ప్రత్యేక సందేశం

ప్రాక్‌పశ్చిమ సమ్మేళనము 1962 నవంబరు 1 నుండి 5 వరకూ పూణేలోని గురుప్రసాద్ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనం గురించి ఇప్పటికే పలు పత్రికలలో ప్రచురించడమైంది. 2012 నవంబరులో మెహెరాబాద్‌లో ఈ సమ్మేళన స్వర్ణోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సహవాస్ గురించి ఎన్నిసార్లు ముచ్చటించుకున్నా అది అసంపూర్ణమే అవుతుంది. ఇదొక అపూర్వ సహవాస్. అద్వితీయమైనది. సాటిలేనిది. ఈ అవతార కాలంలో ఎంతో ముఖ్యమైన కార్యక్రమం. అందుకే ఈ సంచికలో చర్విత చరణంగా,

ఆనాటి సమ్మేళనంలోని ముఖ్యమైన విషయాలను అందజేసే ప్రయత్నం చేస్తున్నాం. దయచేసి పరిశీలించండి.!!

**తూర్పు-పడమరలు ఎన్నటి కలవవు. అది ఆర్యోక్తి.**

ఐతే, ఈ సమ్మేళనం తర్వాత తూర్పు – పశ్చిమ దేశాల నడుమ గొప్ప సమన్వయం ఏర్పడింది. నేడు ఈ దేశాల నడుమ కొత్త సంబంధాలు వికసించాయి.

ఇంతకు ముందెన్నడూలేని విధంగా ఒక దేశవాసులు

ఒక దేశం నుండి మరో దేశానికి వెడుతున్నారు.

అంతర్జాతీయ వివాహాలు జరుగుతున్నాయి.

ముఖ్యంగా అమెరికన్లు జర్మన్లను, జపనీయులను వివాహం చేసుకుంటున్నారు.

ఇదంతా అవతారుడు నిర్వహించిన ప్రాక్‌పశ్చిమ సమ్మేళనం వల్లనే సాధ్యమైంది.

**నవంబరు 1న గురుప్రసాద్ రాజప్రాసాద ప్రాంగణంలో**

ఈ సమ్మేళనం ఎంతో వేడుకగా ప్రారంభమైంది.

ప్రముఖ ఆస్ట్రేలియన్ కవి పండితుడు ఫ్రాన్సిస్ బ్రాబజాన్

ఆనాటి సమ్మేళనాన్ని తన కవితా ధోరణిలో వర్ణిస్తూ ఇలా అన్నాడు.

**"వారు ప్రేమవనానికి బయలుదేరారు.**
**కాని సముద్రం ఒడ్డుకి చేరారు.**
**గులాబీల సౌరభాన్ని ఆస్వాదించేందుకు వచ్చారు.**
**అనంతసాగరాన్ని తిలకిస్తూ మైమరచిపోయారు".**

సాగరాన్ని ఒక్కక్షణకాలం తిలకింపజేసి అవతారుడు వారిని ఒడ్డుకు చేర్చాడు. వారు ఆయన పాదాల నీడన సేదతీరారు. వారి హృదయాలలో ప్రేమ నిండింది.

ప్రేమికులు ఒక్కొక్కరూ వెళ్ళి బాబా పాదాలకు నమస్కరించారు. అప్పటి వరకూ ఆలోచనలతో నిండివున్న వారి మనస్సు ఒక్కసారిగా శూన్యమైపోయింది. పరిసరాలను మరచిపోయారు. బాబా చెంతకు ఎలా చేరారో కూడా తెలియని స్థితి వారిది.

బాబాతో ఎన్నో చెప్పాలనుకున్నా ఏమీ చెప్పలేకపోయారు.

మనస్సులో ఏ కోరికలూ లేవు. అంతా శూన్యమైంది.

**మాయ** మళ్ళీ తమ దరి చేరకూడదనుకున్నారు. కానీ...షరా మామూలే!!

సహవాస్ మొదటిరోజున అందరూ మధ్యాహ్నం రెండు గంటలకే వారి వారి కుర్చీలలో కూర్చున్నారు. పాశ్చాత్యుల కోసం మొదటి రెండు వరుసలు కేటాయించారు.

ఎండవేడి ఎక్కువగా వుంది. ఆకాశం నిర్మలంగా వుంది.

వేదిక మీద బాబా పాదాల చెంత బరోడా మహారాణి నేల మీద కూర్చున్నారు.

ఇంతలో అకస్మాత్తుగా వర్షం ప్రారంభమైంది. అది వర్షాకాలం కూడా కాదు.

రెండు నిముషాలలో అంతా జలమయమైంది.

తడిసి ముద్దైన పాశ్చాత్య స్త్రీలను గురుప్రసాద్‌లోకి తీసుకెళ్ళారు.

బాబా స్త్రీ మండలి వారి దగ్గరున్న పొడి దుస్తులు ఇచ్చారు.

అమెరికన్ మహిళలు స్త్రీ మండలి ఇచ్చిన చీరలు కట్టారు.

భారతీయ సాంప్రదాయ వస్త్రాల కట్టుతీరు వారికి తెలియదు కదా!!

"విచిత్ర వస్త్రధారణలతో వింతగా కనిపించినట్లు, క్రిస్మస్ ట్రీలా వున్నామని తమలోతాము ఛలోక్తులు విసురుకున్నారు".

పాశ్చాత్యులను, భారతీయులను ఒకటి చేయడానికి ఇది అవతారుని ఎత్తుగడ.

**భారతీయ స్త్రీలందరూ పూర్తిగా తడిసిపోయినా,**

**వారు తమ కుర్చీలలోంచి కదలక ప్రశాంతంగా వున్నారు.**

బాబావారి ముఖ్య కార్యక్రమాలలో వర్షం పడటం సర్వసాధారణం అంటారు బాబా ప్రేమికులు. మిర్టిల్‌బీచ్ సహవాస్‌లో కూడా ఇలాంటి అనుభవం ఎదురైందని సమాచార భోగట్టా. ఆనాటి సహవాస్‌లో పాల్గొన్న ప్రేమికులందరూ బాబా సందేశానుసారం జీవితం గడుపుతూ బాబా నామస్మరణ వ్యాప్తికి ఎంతగానో కృషిచేస్తున్నారు. బాబా వారికి ప్రేమామృతం ప్రసాదించారు.

ఈ సమ్మేళనంలో అవతారుడు పలు విశేష సందేశాలు ఇచ్చారు.

అందులో ప్రధానమైన ఒక సందేశాన్ని ఈ సంచికలో మీ ముందుచుతున్నాం.

ఆధ్యాత్మికపథంలో వున్నవారు భగవదైక్యం కోరుకుంటారు.

ఇదే మానవజీవిత లక్ష్యం కదా!! ఈ అంశంపై అవతారుడు ఆనాటి సమ్మేళనానికి హాజరైన పాశ్చాత్యులతో ఎంతో వివరంగా చెప్పారు.

ఆ వివరాలను ప్రక్క పేజీలలో పరిశీలించగలరు.

# బ్రహ్మైక్యం భూమ్మీదనే సాధ్యం

1962 నవంబరు 2 ఉదయం 9 గంటల ప్రాంతంలో గురుప్రసాద్ హాలులో పాశ్చాత్య బాబా ప్రేమికులు బాబా చుట్టూతా కూర్చున్నారు.
అంతకుముందు రోజున పెద్ద వాన కురిసింది. వానలో బాగా తడిశారు కదా! జలుబు చేశిందా? అని బాబా అడిగారని ఆ సమావేశంలో పాల్గొన్న ఒక అమెరికన్ ప్రేమికుడు ఆనాడు తమతో బాబా జరిపిన సంభాషణను గ్రంథస్తం చేశారు. అత్యంత ఆసక్తికర ఆ ఆధ్యాత్మిక విషయాలు ఇలా వున్నాయి. దయచేసి పరిశీలించండి. ఇలా కబుర్లలో ఉండగానే ఆస్ట్రేలియన్ బాబా ప్రేమికుడు, ప్రముఖ కవి పండితుడు ఫ్రాన్సిస్ బ్రాబజాన్ ఒక పెద్ద చార్టు తీసుకొచ్చి గోడకు వ్రేలాడదీసాడు. బాబా దానిని చూపిస్తూ –
**"THE CHART OF FOUR JOURNEYS"** అని వివరించారు.
అందరికీ కనబడుతోందా? అని బాబా తిరిగి తన సంజ్ఞలతో ప్రశ్నించారు.
ఎంతో కష్టమైన ఆధ్యాత్మిక విషయాల్ని చాలా సూక్ష్మంగా ఈ చార్టులో వివరించడమైందన్నారు బాబా. మీరంతా చదువుకున్న వాళ్ళు.
సూక్ష్మంగా వున్న చిన్న చిన్న విషయాల్ని కూడా చాలా కఠినంగా, కష్టంగా మార్చివేశారని బాబా అన్నారు. మీరు అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండు, యూరోపుల నుండి పూణేకి వచ్చారు. మరికొందరు ఒకచోట నుండి మరో ప్రదేశానికి లేదా చంద్రుని దగ్గరకో, కుజ, అంగారక గ్రహాల దగ్గరకో ప్రయాణం చేస్తారు.
ఈ ప్రయాణం బహిర్గత ప్రయాణం. (External Journey).
ఈ చార్టు ద్వారా నేను చెప్పబోయేది అంతర్గత ప్రయాణం గురించి అన్నారు బాబా.
ముందుగా రెండు ముఖ్యమైన విషయాలు తెలుసుకోవాలి.
భగవంతుడు అనంతుడు (GOD is Infinite).
ఆయన నీడ కూడా అనంతమైంది (His shadow also is infinite).
ఈ వివరణను చార్టులోని సన్నని గీతలు ద్వారా చూపించడమైంది.
గమనించండన్నారు. అనంతుడైన భగవంతుడు ఆయన ఛాయ పరిధిలోనే అనంతమైన స్థూలదేహం (Gross sphere) ఉందని బాబా సూచించారు.
భగవంతునికి పరిమితులు లేవు.
ఆయన అపరిమితుడు (God is boundless & limitless).
ఈ అపరిమితమైన ఛాయాపూరిత స్థూల దేహంలో,
అసంఖ్యాకంగా, లెక్కకు మిక్కిలిగా ఎన్నో విశ్వాలు, విశ్వాంతరాళాలు ఉన్నాయి.

CHART VI

# THE FOUR JOURNEYS



కొన్ని విశ్వాలలో (Galaxies) మానవాళి నివసిస్తోంది.
మరికొన్ని విశ్వాలలో ఆవాసయోగ్యత లేదు.
కొన్ని లక్షల సంఖ్యలో నక్షత్రాలు, సూర్య చంద్రాదులు
ఈ అనంత ఛాయా పూరిత స్థూల దేహంలో వున్నాయని బాబా వివరించారు.
ఐతే, మనం నివసిస్తున్న ఈ భూమికి ఒక ప్రత్యేకత వుందని బాబా అన్నారు.
(..but of all these non-habitable and habitable worlds, this earth has a special position. It is the only place where the experiences of the subtle and mental worlds can be had by human beings. Only on this earth can a man realize God. --Lord Meher Vol. VIII Page. 4291).
ఈ భూమ్మీద మాత్రమే మానవులు సూక్ష్మ, మానసిక ప్రపంచాలను
(Subtle and Mental) అనుభవించగలరని బాబా స్పష్టం చేశారు.
అంతేకాదు ఈ భూమ్మీద నివసిస్తున్న మానవాళికి మాత్రమే భగవత్ సాక్షాత్కారం,
భగవదైక్యం, బ్రహ్మైక్య సాధన సాధ్యమౌతుందని మెహెర్‌బాబా స్పష్టంగా పేర్కొన్నారు.

## సూక్ష్మ ప్రపంచం:-

సూక్ష్మ ప్రపంచం ఎక్కడ? ఎలా? వుంటుంది అంటే, అవెక్కడో లేవని బాబా చెబుతూ,
అవి నీలోనే వున్నాయన్నారు. బాహ్యంగా మన కంటికి కనబడేవికావవి అని అన్నారు.
సూక్ష్మ ప్రపంచానికి ప్రయాణం అంటే అది నీలో నీవు చేసే
అంతర్గత ప్రయాణం (It is journey within) అని బాబా అన్నారు.
మీరు చూస్తున్న ఈ బాహ్య ప్రపంచం, ఈ అందచందాలు, అందవికారం అంతా
నిజం కాదు. వాస్తవం కాదు. ఇదంతా మిధ్య.ఎందుకూ కొరగానిది అన్నారు బాబా.
. బాహ్యంగా మనం చూస్తున్న ఈ అనంతమైన స్థూల ప్రపంచమంతా
మిధ్యయే అని బాబా తిరిగి అన్నారు. దీనికి ఏ మాత్రం విలువలేదు.
ఐతే, ఈ పుడమి తల్లి పవిత్రమైనది. ఈ భూమ్మీద మీరు నివసిస్తూ,
ఇక్కడ వుంటూనే నీలో నీవు **అంతర్గత ప్రయాణం** చేయడమనేది
అత్యంత ప్రధానమయింది. ఈ భూమి మీద నివసిస్తున్న ఎందరో
ఆధ్యాత్మిక చింతనాపరులు తమ అంతర్గత ప్రయాణం ద్వారా
సూక్ష్మ ప్రపంచ అనుభవాన్ని అనుభవించగల్గుతున్నారు.
ఇలా అంతర్గత ప్రయాణం చేసే ఆధ్యాత్మిక చింతనాపరులు ఎక్కడివారక్కడే వుంటారు.
అలా ఉంటూనే ఒక విశేష అనుభూతిని అనుభవిస్తారు.
అంటే, ఈ అనుభూతి కోసం వారు ఎక్కడో హిమాలయాలలోని మంచుకొండల
దగ్గరకు వెళ్ళవల్సిన పనిలేదని బాబా స్పష్టంచేశారు.

(For the one who journeys within, everything remains as it is;
his experiences are of a different nature).
బాబా ఇంకోమాట చెప్పారు. ఎప్పుడైతే సూక్ష్మ ప్రపంచంలో అడుగుపెట్టి, అక్కడి ప్రశాంతతను, విశేష అనుభూతిని చవిచూస్తారో ఇకవారికి బాహ్యంగా వున్న ఈ స్థూల ప్రపంచం, ఈ స్థూల ప్రపంచం తాలూకు అనుబంధం, అనుభూతులు ఏమీ వుండవు. సూక్ష్మ ప్రపంచంలోనే అతను తన ఆనందాన్ని వెతుక్కుంటాడు.

## మానసిక ప్రపంచం

ఈ అంతర్గత ప్రయాణం ఇలాగే మరికొంత సమయం కొనసాగితే
ఆ ప్రయాణికుడి అనిర్వచనీయమైన అనుభూతి మరింత బలపడి,
మానసిక ప్రపంచంలోనికి అడుగిడతాడు. మానసిక ప్రపంచంలో అతనుండే సమయంలో తన ఎదురుగా వున్నవారిని గమనించగల్గుతాడు. వారివారి మనస్సుల్లోని భావాలను పసిగట్టగల్గుతాడు. ఎదుటివారు ఏమి ఆలోచిస్తున్నారు, ఎవరి గురించి చింతిస్తున్నారు, ఇత్యాది విషయాలు అతనికి అవలీలగా అవగతమౌతాయి.
ఈ స్థితిని దాటి ముందుకు ప్రయాణిస్తే, అతడు తనలోనే వున్న భగవంతుడిని దర్శించగల్గుతాడు. అన్నింటా,అందరిలోనూ భగవంతుడిని దర్శించగల్గుతాడని బాబా అన్నారు. ఈ మానసిక ప్రపంచంలో వుండగానే ఈ ఆధ్యాత్మిక బాటసారి తనకూ – భగవంతునికీ మధ్య ఒక పెద్ద అగాధం (Sees an abyss, gulf) వున్నట్లు గమనిస్తాడు. ఈ స్థితిలో అతనికి భగవదర్శనం కల్గుతుంది కానీ
భగవదైక్యం సాధ్యం కాదు. ఆ బాటసారి భగవదైక్యం కోసం పరితపిస్తాడు.
భగవదైక్యం కోసం చకోర పక్షిలా ఎదురుతెన్నులు చూడవల్సివస్తుంది.
ఈ బాటసారి తన అంతర్ముఖ ప్రయాణాన్ని మరింత తీవ్రంగా ముందుకు సాగిస్తే, భగవంతునికీ–బాటసారికీ మధ్యన వున్న మాయ తొలగిపోతుంది.
ఆ మాయ తొలగినప్పుడు, భగవంతుడొక్కడే అనే అనుభవం కలుగుతుంది.
ఈ ప్రపంచం, తాను చూస్తున్న ఈ విశ్వం అంతా ఒక భ్రాంతి అని ఆతనికి తేటతెల్లమౌతుంది. అనంతజ్ఞాన సంపన్నుడైన భగవంతుడి శక్తిని, దయను అనుభవిస్తాడు.
He knows there was no space, no worlds, no universe,
it was all just a shadow play ‘ He experiences GOD ALONE IS.
కానీ, అతడు ఆ జ్ఞానాన్ని, శక్తిని ఇతరులకోసం కానీ,
ఇతర విషయాల కోసం కానీ వినియోగించ రాదు. చివరిగా బాబా ఏమన్నారంటే, ఈ అంతర్గత ప్రయాణం ప్రారంభించడమే చాలా కష్టం. ఒకసారి ఈ ప్రయాణం మొదలయితే సాధారణంగా చురుకుగా ముందుకు సాగుతుంది.

మనం ఒక దేశం నుండి మరో దేశానికి, లేదా ఒక గ్రహ ఉపరితలం నుండి మరో గ్రహానికి, ఇలా ఎంత దూరమైనా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకోవడం చాలా సులువైన పని. కానీ, ఈ అంతర్గత ప్రయాణం (Inward journey) అంత తేలికైన పని కాదన్నారు. చాలా కొద్దిమంది మాత్రమే ఈ ప్రయాణంలో కడపటిదైన ఏడవ భూమికను చేరుకో గల్గుతారన్నారు.

బాబా ఆ చార్టు చూపిస్తూ అంతర్గత ప్రయాణం గురించి వివరిస్తూ,

## హా(...చెప్పండి

నేను చెప్పిందేమైనా తలకెక్కిందా? అని అడిగారు.
సరే... అర్థం కాకపోయినా వచ్చే నష్టం ఏమీ లేదన్నారు.
దాని గురించి బుర్ర బ్రద్దలుకొట్టుకోవద్దన్నారు.
అవతారుని సమక్షంలో వున్న మీ అందరికీ,
అవతారుని కాలంలో వున్న వారందరూ అంచలంచెలుగా వున్న
ఈ అంతర్గత ప్రయాణం గురించి ఆలోచించాల్సినంత
పనిలేదని బాబా భరోసా ఇచ్చారు.
అవతారుని Grace? మీ మీద వుంటే,
మీరు ఎక్కడ వున్నా, మిమ్ముల్ని ఎక్కడికి తీసుకెళ్ళేందుకు మీరు అర్హులో అక్కడికి,
ఈ రైళ్ళూ, విమానాలు అవసరం లేకుండానే
క్షణకాలంలో అవతారుడు తీసుకెళ్ళిపోతాడు.
మీకు భయమేల అని బాబా హామీ ఇచ్చారు.
ఇదంతా మీ కోసం కాదు.
రాబోయే తరాలవారి కోసమంటూ బాబా చిరునవ్వులతో అన్నారు.
కేవలం నా పట్ల విధేయతతో వుండండి. అది చాలన్నారు బాబా.
నన్ను ప్రేమించండి!! నా కొంగును జారవిడవకండి!
అంతమాత్రం మీరు చేయగల్గితే, నేనెక్కడ వుంటే మీరూ నాతోనే వుంటారు.
మీరు Inward journey చేయాలనుకుంటే కూడా మీరు నాతోనే వుంటారన్నారు.
ఎందుకంటే, నేను ఆ ప్రయాణంలోనూ వున్నాను కదా అన్నారు.
మీరు చూస్తున్నదంతా మిధ్య. భగవంతుడొక్కడే సత్యం.
You must love god, see god & become one with god.
That is your duty. ఇదంతా మిధ్య అని తెలుసుకోవడం మీ విధి.
భగవంతుడిని ప్రేమించాలంటే కూడా అది మీ చేతుల్లో ఏమీ లేదు.
But to love god is also not in your hands. It is a gift from god to you

## 18 వేల ప్రపంచాలలో మానవాళి

కొన్ని వేల విశ్వాలు వున్నాయన్నాను కదా!!
అవి ఎన్నివున్నాయో చెప్పనలవి కాదు.
నేను చెప్పిన ఈ విషయాన్ని శాస్త్రజ్ఞులు త్వరలో కనుగొంటారు.
18 వేల ప్రపంచాలలో మానవాళి నివసిస్తోంది.
వీటిల్లో నివసించే కొంతమంది మానవులకు అసమానమైన తెలివితేటలున్నాయి.
ఐతే, జాగ్రత్తగా వినండి.
ఈ ప్రపంచాలలో నివసించేవారెవరికీ సూక్ష్మ, మానసిక ప్రపంచాల అనుభవం వుండదు.
వీరందరూ తప్పక మనం నివసిస్తున్న భూమి మీద జన్మ ఎత్తాల్సిందే!
అప్పుడే వారికి సూక్ష్మ – మానసిక ప్రపంచాల అనుభూతి లభిస్తుంది.
ఇది అవతార పురుషుని కాలం. అందునా మౌనావతారుని ప్రత్యేక సమయం.
నేడు శాస్త్రజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది.
ఇతర గ్రహాల ఉపరితలాలపై నివసిస్తున్న
అసమానమైన తెలివితేటలు గలవారు
చాలామంది ఈ భూమ్మీద జన్మించారు.
అలాగే, మరెందరో మేధావులు కూడా ఈ భూమిమీద మానవజన్మ ఎత్తడానికి
ఈ అవతార కాలంలో తహతహలాడుతున్నారు.
అందుచేతనే నేడు ప్రపంచ జనాభా నానాటికీ
శాస్త్రజ్ఞులకు అందనంత ఎత్తులో పెరుగుతోంది.
ఒకటిమాత్రం బాగా గమనించండి!!
మీరు చూస్తున్నదంతా మిధ్య. భగవంతుడు ఒక్కటే సత్యం.
నేను మానవరూపధారిగా వచ్చిన భగవంతుడను.
ఇతర గ్రహాలమీద మానవాళి నివసిస్తోందని
శాస్త్రవేత్తలు త్వరలో తప్పక కనుగొంటారని బాబా అన్నారు.

****

## మెహెర్‌బాబా పత్రిక కోసం

**శ్రీ సి.వై. చింతామణి, గౌరవ అధ్యక్షులు, విజయనగరం బాబా కేంద్రం మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ ఖర్చుల కోసం రూ 1000/– విరాళంగా పంపారు. ధన్యవాదములు. జైబాబా.**



## శ్రీ ఎ.ఎస్. జగన్నాథ్

**ఈస్ట్ - వెస్ట్ సహవాస్‌కు హాజరైన శ్రీ ఎ.ఎస్. జగన్నాథ్ గారు చెప్పిన మాటలివి.**

ఈ సహవాస్‌కు ఐదు వేలమంది ప్రేమికులను ప్రత్యేకంగా అవతారుడు ఆహ్వానించారు.
నేను మెహెర్‌బాబాను తొలిసారిగా 1955 నవంబర్‌లో దర్శించుకున్నాను.
ఆ దరిమిలా 1958 ఫిబ్రవరిలో, 1962 నవంబరులో పూణేలో జరిగిన
ఈస్ట్-వెస్ట్ సమావేశాలకు హాజరయ్యాను.
ఈ సమావేశాలకు మేము విజయవాడ నుండి పూణే వెళ్ళాం.
సమావేశపు తొలిరోజున 'కుంభవృష్టి వాన కురిసింది.
ఆ పెద్ద వానలో అందరం పూర్తిగా తడిసిపోయాం.
చంటిపిల్లలు కూడా ఆ వానలో తడిసి పోయారు.
ఐనా కూడా వారు చిన్న చప్పుడు చేయలేదు.
అంతక్రితమే త్వరగా దర్శనం చేసుకోండన్నట్లు బాబా సంజ్ఞలు చేశారు.
అదేదో క్యూలో నడుస్తున్న వారిని తొందరచేయడమని అనుకున్నాం కానీ,
అంతలోనే పెద్ద వానవస్తుందని ఎవరూ ఊహించలేదు.
భారతీయ సంప్రదాయం ప్రకారం
భగవంతుని దగ్గరకి వెళ్ళే ముందర
నదీస్నానం చేయడం లేదా దగ్గర్లోని కోనేరులో
మునిగి వెళ్ళడం మన ఆచారం.

ఐతే ఈ సమావేశాల తొలిరోజున
అవతారుని సమక్షంలో నిలువునా తడిసిన మాకు
ఆ పవిత్ర నదీస్నానం లభించినట్లయిందని
నేడు నాకనిపిస్తోందన్నారు శ్రీ జగన్నాథ్.
ఆ మర్నాడు ఎవరికైనా జలుబు చేసిందా? అని బాబా వాకబు చేశారు.
ఒక్కరు కూడా రపీమని తుమ్మలేదు.
ఈ విషయమై బాబా ఏమన్నారో తెలుసాండి?
ఇంతవరకు మీలో వున్న సంస్కారాలను
ఈ వర్షంతో కడిగివేశానన్నారు.
రేపటి నుండి మీకు మీరే బాధ్యులని బాబా హెచ్చరించారు.

## అవతారుని ఆరోగ్యం

1962 నవంబరు నెలలో మెహెర్‌బాబా ఆరోగ్యం బాగాలేదు.
ఆరోగ్యం బాగాలేదని అంటే తీవ్రమైన ఈడ్పులు వచ్చేవి.
దాదాపుగా 1962వ సంవత్సరం ప్రారంభం నుండి ఈ మాదిరి ఈడ్పులతో,
బాబావారి శరీరం పడుకున్న మంచంపై నుండి ఎగిరి పడినంతగా వుండేది.
దీనికి తోడు జ్వరం వుండేది.
అప్పటికే బాబాకు రెండుసార్లు కారు ప్రమాదానికి గురయ్యారు.
కుడికాలు తీవ్ర నొప్పితో బాధవుండేది.
ఈ అనారోగ్యానికి కారణం వైద్యులెవరికీ అంతుబట్టలేదు.
బాబా ప్రేమికులు డాక్టర్ గోహెర్, డాక్టర్ విలియం డాంకిన్ మాత్రమే
వైద్యం అందించారు. వీరు కాకుండా మరెవర్నీ
బాబా అనుమతించలేదు.
ఇటువంటి ఆరోగ్యపరిస్థితిలో ఈస్ట్-వెస్ట్ గేదరింగ్ సమావేశాలు
బాబా నిర్వహించారని ఈనాడు తెలుస్తోంది.

****

## బాబాలో ఐక్యం

బాబా ప్రేమికులు శ్రీ లలిత్, రూర్కి, గారి భార్య శ్రీమతి రాజ్ నవంబరు 10న బాబాలో ఐక్యమయ్యారని స్థానిక బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు.

# రెక్కలున్న తెల్లని గుర్రం




మెహెరాజాద్‌లో ఓ గోడకు వ్రేలాడదీసిన "రెక్కలున్న తెల్లని గుర్రం" తైలవర్ణ చిత్రాన్ని బాబా ప్రేమికులు చాలామంది చూసేవుంటారు. ఆ తెల్లని గుర్రం దేనికి సంకేతం? దాని విశిష్టత ఏమిటో మెహెరామాయి ఒక సందర్భంలో ఇలా వివరించారు. 'రెక్కలున్న తెల్లని గుర్రం" ఈ అవతార కాలానికి చిహ్నం. బాబా తమకు చెప్పిన మాటలు గుర్తుచేసుకుంటూ ఆమె ఇలా చెప్పారు. రామావతారంలో ప్రజలు చాలా సత్యవంతులు. ఆనాటి సమాజం కూడా నేటిలా వుండేది కాదు. ఐతే ఇదే మాదిరిగా ఎల్లకాలం ఉండదని రాముడు తన భక్తులకు, చెప్పాడు. అలాగే, కలియుగంలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా వుంటాయి. యుద్ధాలు, అలజడులు, అకృత్యాలతో యావత్తు ప్రపంచం అశాంతిగానే వుంటుందని చెప్పారు. ఈ మాట ఆనోట–ఈనోట రామభక్తులందరికీ తెలిసి, వారు భయంతో తమను కలియుగంలో పుట్టకుండా కాపాడమని రాముడ్ని వేడుకున్నారు. **అందుకే మనమిప్పుడు బాబా రక్షణలో వున్నాం. ఆయన ప్రేమికులమైన మనం బాబా ప్రేమ సందేశాన్ని నలుదిశలా ప్రసరింపచేయాలని మెహెరామాయి వివరించారు.** ఆపై మెహెరా చిరునవ్వులతో మీకు తెలుసా? ఇందుకోసమే ఈస్ట్ –వెస్ట్ సమావేశాలను బాబా ఏర్పాటుచేశారు. ఈ సమావేశాలలో పాల్గొనడానికి కేవలం బాబా ప్రేమికులే అర్హులు. ఈ సమావేశాలు యావన్మంది ప్రజానీకం కోసం కాదని బాబా స్పష్టం చేశారు. 1956లో మెహెర్‌బాబా జరిపిన విదేశీ పర్యటనలో బాబా కొంతమంది ప్రేమికులను ఈ సమావేశాలకు తప్పక **(MUST)** హాజరుకావాలని, తన పిడికిలి బిగించి గట్టిగా బాబా ఆహ్వానించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అలా ఎందుకు బాబా చేశారో ఇప్పుడు తెలుస్తోందన్నారామె!!

****



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,**

**వాల్యూం-3 (1925 నుండి -**

***తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ***

***(గత సంచిక తరువాయి)***

కిట్టీ తమ్ముడు, హెర్బర్ట్‌ని బాబావారు చైనా వెళ్ళమన్నారు.
గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది అతనికి.
బాబావారి పాదసేవ చేసి తరించాలని వువ్విళ్ళూరుతున్న అతగాడిని,
ప్రభువుకి దూరంగా వెళ్ళమంటే బాధవేయడం సహజం.
ఈ మాటే చెప్పాడతను. కంట తడి పెట్టాడు.
మీ నామ ప్రచారానికి నడుం కట్టాలనుకొన్నాను బాబా.
నన్నిలా దూరంగా పంపడం భావ్యమేనా మీకు అన్నాడు.
ప్రభువు కరిగినట్లు కనబడలేదు.
గుండెలు పిండేసినట్లయింది.
దుఃఖం పొంగిపొర్లింది.
ప్రభువు పాదాల పైన పడ్డాడు.
దేవా! ఇది నీకు భావ్యం కాదు.
నన్నంత దూరం పంపేయకండి.
మీ కోసం ఎంతో చేద్దామనుకొన్నా.
మీతోనూ అన్నాను ఆ మాట.
ఇంతవరకూ ఏమీ చేయలేదు.
నా మాట నిలబెట్టుకొనే అవకాశం యియ్యి ప్రభూ! అంటూ మొరపెట్టాడు.
మెహెరుడు స్పందించాడు. నువ్వు ఎక్కడున్నా, ఎంత దూరం వెళ్ళినా నావాడివే!!
నీ వెంట నేనుంటానుగా అని బాబా వారు అంటూంటే, హెర్బర్ట్ వూపిరి తీసుకొన్నాడు.
ప్రభువు చెంత నేనున్నా, నా చెంత ప్రభువు వున్నా వొక్కటే కదా అనిపించింది.
స్థిమితపడ్డాడు. కన్నీళ్ళు తుడుచుకొన్నాడు. చైనాలో ఎలా వుండాలో బాబా వారు చెప్పారు.
మీ హితవాక్యం పాటిస్తానన్నాడు హెర్బర్ట్.
మాంసం ముట్టకు అన్నారు.

చిత్తం. శాఖాహారిగా మారతానన్నాడు.
మద్యం సేవించకు. సిగరెట్టుకీ దూరంగా వుంటానని శపథం చేశాడు.
నల్లమందు సేవించకు అన్నారు.
కలలో కూడా మత్తు పదార్థాలని ముట్టనన్నాడు.
ప్రభువు సంతసించారు.
ఈ నియమాలు నిష్టలు అన్నీ నీ మంచి కోసమే అన్నారు బాబా!
మీ మాట నాకు శిరోధార్యం.
ఈ నియమాలు నాకు లక్ష్మణ రేఖ అని మనవి చేశాడు.
రోజూ ధ్యానం చేయమన్నారు.
వొకటి రెండు గంటలు నిష్ఠగా ధ్యానం చేయి అన్నారు.
ఖాళీ సమయంలో ఏం చేయాలి?
"ఏముంది స్థానికులతో కలవిడిగా తిరుగు.
వాళ్ళతో స్నేహం చేయి", అన్నారు.
అంతేనా? ఇంకేమయినా చేయాలా?
ఇదీ ధర్మ సందేహం మన హెర్బర్ట్ వారికి.
నువ్వింకా చేయాల్సింది, చైనాలో చాలా వుందన్నారు బాబా.
ఆ సంగతి నీకు దరిమిలా తెలుస్తుందన్నారు.
అది ఏలాగున ... అడగలేదు కానీ,
మొహం ప్రశ్నార్థకంగా పెట్టాడు.
బాబా వారు చిరునవ్వు నవ్వారు.
కంగారు పడకు అన్నాడు.
నీ మనస్సుకే తట్టుతాయి అన్నారు.
అంతరాత్మకి చెప్తారన్నమాట అనుకొన్నాడు.
ఇంకో మాట చెప్పారు.
చైనాలో వున్నన్ని రోజులూ ఆడంబరాలకి పోవద్దన్నారు.
సాదాసీదాగా వుండమన్నారు.
స్థానిక చైనీయులతోటి, స్నేహంగా వుండు.
అలానే ఇంగ్లీషువాళ్ళతో కూడా స్నేహంగా వుండు అన్నారు.
తమ గురించి, అదే బాబా వారి గురించి ఎవరైనా ఆసక్తి చూపిస్తే?
"ఎవరు ఆసక్తి కనబరిచినా, నాగురించి చెప్పు" అన్నారు.
కనీసం పదిహేను రోజులకోసారి అయినా తమ గురించి మాట్లాడమన్నారు.
'బుర్రకి పని చెప్పకు.

నీ విధి నిర్వర్తించు శ్రద్ధగా.
ఇదే నువ్వు చేయాల్సిన పని అని స్పష్టం చేశారు.
“నేనూ వస్తాలే చైనాకి.
నువ్వు ఏంచేస్తున్నావో నేను చూడవద్దూ”, అని బాబా వారు అంటూంటే,
మన హెర్బర్ట్ దొరగారికి ధైర్యం వచ్చింది.
ఇంతకీ, లండన్ నివాసి అయిన హెర్బర్ట్‌ని
చైనాకి ఎందుకు వెళ్ళమంటున్నారు.
ఇదేమన్నా వనవాసమా అతనికి?
ఈ ప్రశ్నలు పాఠకులకు రావటం సహజం.
మెహెరీశుడు ఏ పని చేసినా,
దానికొక కారణం వుంటుంది.
ఆ కారణం వొకోసారి వెంటనే తెలుస్తుంది.
వొకోసారి ఎప్పుడో తెలియవచ్చు.
బాగా డబ్బు సంపాదించి, ఎంతో కొంత పొదుపు చేసి,
ప్రభువు నామవ్యాప్తికి ఖర్చు చేయాలన్న ఆలోచన
హెర్బర్ట్‌కి వచ్చింది ఆ మధ్య.
ఉద్యోగాన్వేషణ మొదలు పెట్టాడు.
“ఇంగ్లీషు మాస్టారి ఉద్యోగం ఖాళీ వుంది వస్తావా”, అని పిలుపువచ్చింది
చైనా నుంచి.
చైనా వెళ్ళాలా వద్దా అన్న సందిగ్ధంలో పడ్డాడు.
బాబావారి రాక హడావుడిలో
చైనా వుద్యోగం గురించి మరచిపోయాడు.
సర్వాంతర్యామికి అన్నీ తెలుసు.
అందుకనే తామే స్వయంగా
చైనా ప్రస్తావన తెచ్చారీవాళ,
అంటే సెప్టెంబరు 16వ తేది బుధవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో
హెర్బర్ట్‌కి ఉద్యోగం ఇస్తానన్న వారు ఎవరో తెలుసా?
లీగ్ ఆఫ్ నేషన్స్. ప్రపంచశాంతి కోసం
కంకణం కట్టుకొన్న దేశాల సమాఖ్య ఈ సంస్థ.
మన యిప్పటి ఐక్యరాజ్య సమితి.
ఐ.రా.స. వంటిది.
మరి అటువంటి ప్రపంచసంస్థలో ఉద్యోగం మంచిదే కదా,

ఇదేమాట బాబావారు శెలవిచ్చారు.
ధైర్యంగా వెళ్ళు.
నీ వెంట నేను వున్నాను అంటూ అభయం పలికారు ప్రభువు.
దిగులు పటాపంచలైంది హెర్బర్ట్‌లో.
చైనా యాత్రకి రెడీ అయ్యాడు.
మధ్యాహ్నం, బాబావారు బీచ్ కేసి కదిలారు.
వెంట మన హెర్బర్ట్ గారు పరిగెత్తారు.
మెరిడిత్, మార్గరెట్, కిట్టీ, రుస్తుం, ఛాన్జీ, ఆలీ బయలుదేరారు.
నేనేనా రానిది నేనూ వస్తున్నా అంటూ,
జిల్లా బాబావారి వెనక పరుగెత్తింది.
బీచ్‌లో బాబావారు చాలాసేపు పచార్లు చేశారు.
క్రికెట్ ఆడుకొందామా అన్నారు.
రెడీ అన్నారు అందరూ.
కాసేపు క్రికెట్ ఆడారు.
క్రికెట్ విసుగు అనిపిస్తే, మరికొన్ని గేమ్స్ ఆడారు.
అలసిపోయి ఆశ్రమం ముఖంపట్టారు.
సాయంత్రం తెనీటి విందు ఏర్పాటు చేశాడు మెరిడిత్.
ఆశ్రమం ఆవరణలో వో నాలుగు అయిదు కుర్చీలు వేయించాడు.
బాబావారు కుర్చీలో కూర్చున్నారు.
కొందరు నెలపైనే చతికలబడ్డారు.
కెమెరాకి పని చెప్పారు కొందరు.
వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.
ఏమాటకామాట చెప్పాలి,
బాబావారు ఇంగ్లాండులో అడుగు పెట్టినప్పటి నుంచి
సూర్యుడు మేఘాల మధ్య దాక్కొనటం లేదు.
అలా అని ప్రచండ భానుడిగానూ మారటం లేదు.
చూడచక్కని ఎండ యిది అన్నారొకరు, ఆనందం పట్టలేక.
కొంతమంది, అదీ మహిళలు కాళ్ళు బార్ల చాపి కూర్చున్నారు.
ఈ దృశ్యం రుస్తుం కంటపడింది.
ఛాన్జీకేసి చూశాడు.
అప్పుడే అతను వాళ్ళకేసి చుశాడు.
ప్రభువు సన్నిధిలో కూర్చునే తీరు ఇదేనా అని ముక్కున వేలు వేసుకొన్నారు.

అలా కూర్చోవద్దమ్మా అని చెప్పాలనిపించింది ఇద్దరికీ.
కానీ ధైర్యం చాల్లేదు.
ఎప్పుడూ, ఎవరికీ చెప్పలేదు
అలా వుండాలి, యిలా వుండాలి ప్రభువు సన్నిధిలో అని.
మరి ఈవేళ ప్రభువు సమక్షంలో
ఆ సాహసం చేయాలనుకోలేదు.
ఆచారాలకీ, చాంధస పద్ధతులకే స్వస్తి చెప్పిస్తున్న అవతారుని ముందు
ఎలా కూర్చొంటే ఏమిటనిపించింది మనస్సులో.
భక్తి వుండాలి కానీ కాళ్ళు చాపుకొన్నా,
బాసింపెట్టివేసుకొన్నా ఏమిటి? అనిపించింది రుస్తుం గారికి.
సరిగ్గా అదే అభిప్రాయానికి వచ్చారు ఛార్జీ గారు.
ప్రభువుకి యిదేమీ పట్టినట్లు లేదు.
ఎందుకంటే, మన మండలి వారు తలపట్టు కొంటూంటే,
అవతారుడు పిల్లి పిల్లలతో ఆడుకొంటున్నారు సరదాగా.
కుక్కలన్నా పిల్లులు అన్నా మెహెరీశుడికి యిష్టమని తెలుసు
ఆ యింగ్లీషు దొరలకి, దొరసానులకీ.
ఇదిగో ఈవేళ ప్రత్యక్షంగా చూస్తున్నారు.
ఆ రాత్రి ఇంకో పదిహేను నిముషాలకి ఎనిమిది కొడ్తుందనగా,
బాబావారు మేడ దిగి వచ్చారు.
ఆశ్రమం ముందు ఖాళీ జాగాలో కూర్చొన్నారు.
దూరంగా సముద్రపు అలల హోరు వినిపిస్తోంది.
పిల్ల గాలులు వీస్తున్నాయి.
చంద్రుడు నేనున్నా అంటూ
మేఘాల మాటు నుంచి బయటికి వచ్చాడు.
ప్రకృతి అందాలు హృదయరంజకంగా వున్నాయి.
హెర్బర్ట్, కిట్టీ, జిల్లా, మెరిడిత్ దంపతులు బాబా వారి చుట్టూ చేరారు.
అవతారుని చల్లని చూపులు తమ సొంతం అనుకున్నారు.
ఒక్కొక్కరి చేతిని తమ చేతిలోకి తీసుకొని నిమురుతున్నారు బాబావారు సుతారంగా.
మనస్సు ఏమంటోంది అని అడుగుతున్నారు.
అలనాటి ఏసుని నేనే అని చెప్పి
ప్రత్యక్షమయిన దివ్యమూర్తి చేతిలో చేయివేసి పట్టుకొని,
ఏమాలోచిస్తున్నావు అని అడుగుతుంటే,

వాళ్ళకి స్వర్గపుటంచులకి వెళ్తున్న భావన కల్గింది.
ఇదొక దివ్యానుభూతి.
మాటలకి అందని మధురానుభూతి.
అదృష్టవంతులమని పొంగిపోయారు.
మనస్సు ద్రవించింది.
కంటనీరు వచ్చింది.
పదకొండు కొట్టే వరకూ జలధార ఆగలేదు.
అది ప్రేమధార!. ప్రకృతి సాక్షిగా,
చరిత్రలో అక్షర సత్యమయిన మేహేరు గాధ అది.
మర్నాడు, సెప్టెంబరు 17వ తేదీ ఉదయం,
వాట్సన్ దంపతులు, హెర్బర్ట్ తిరుగు ప్రయాణానికి రెడీ అయ్యారు.
డేవెన్‌షేర్ ఆశ్రమం వాసులు వీడ్కోలు చెప్పారు.
బాబావారు కూడా వాళ్ల వెంట కారు వరకూ వచ్చారు.
తమ కండువాని హెర్బర్ట్‌కి కానుకగా యిచ్చారు.
రైల్లో తినమని నారింజ పండు చేతిలో పెట్టారు.
రైలు ఎక్కాక హెర్బర్ట్ నారింజ తొక్కులు తీసి, తొనలు తిన్నాడు.
తొక్కలు పారేద్దామనుకొన్నాడు.
కానీ ఈ పండు బాబావారి ప్రసాదం కదా.
తొక్కల్ని పారేయబుద్ధి కాలేదు.
చక చక నమిలి మింగేశాడు.
ఇహ మళ్లీ డేవెన్‌షేర్ ఆశ్రమానికి వస్తే,
మెరిడిత్ "కా అంటే కా, కీ అంటే కీ" అన్నట్లు,
ఆయన మాటకి ఎవరూ ఎదురు చెప్పడం లేదు. సరికదా
ఆయన అన్న ప్రతిమాటకి "సై" అనక తప్పటం లేదు.
పాపం రుస్తం, ఛాన్జీ గారు కూడా
మెరిడిత్ చెప్పినట్లు చేయాల్సివస్తోంది.
ఒక్కమాటలో చెప్పాలంటే
డేవెన్‌షేర్‌కి పెద్ద దిక్కుని నేనే అంటున్నాడు మెరిడిత్.
నా నియమ నిబంధనలు అందరూ పాటించాల్సిందే అంటున్నాడు.
బాబావారు ఎప్పుడు పడితే అప్పుడు
సముద్రపు వొడ్డున పచార్లు చేయడం,
రుస్తుం ప్రభృతులు వుంటున్న గొడ్లశాలకి వెళ్ళటం

మెరిడిత్ దొర గారికి నచ్చలేదు.
ఆ మాటే బాబా వారితో అన్నాడుట కూడా.
ప్రభువు అతగాడిని పట్టించుకోలేదు అనుకోండి.
మెరిడిత్ పెత్తనం నచ్చలేదు కొందరికి.
మేమిక్కడికి వచ్చింది ఈ మహానుభావుడి చెప్పుచేతుల్లో నడవడానికి కాదు.
మెహెరు ప్రభువు సన్నిధిలో వో నాలుగు రోజులు వుందామని వచ్చాము.
అయినా ఈయన పెత్తనం ఏమిటి మా మీద అనుకొన్నారు.
మనసులో మాట బాబావారితో అనేసింది కిట్టీ.
ఈ దాష్టీకం భరించలేక పోతున్నా బాబా అంది.
ఇతగాడి ధోరణి చూస్తుంటే మధ్యవర్తిలా వున్నాడు.
మాకూ–భగవంతుడికీ మధ్య!
అయినా బాబా,
దేముడిని చూడాలంటే మధ్యవర్తి అవసరమా అని సూటిగా ప్రశ్నించింది.
బాబావారు అంతే సూటిగా బదులు చెప్పారు.
మెరిడిత్ మీలో వొకడు. మీకంటే భిన్నమైన వాడు కాదు అని స్పష్టం చేశారు.
భగవంతుని చేరుకోవాలంటే ఇంకో మనిషి అవసరం లేదన్నారు.
భక్తుడికీ భగవంతుడికీ మధ్య మధ్యవర్తితో పనిలేదన్నారు.
మీరనుకొంటున్నట్లు మెరిడిత్ మధ్యవర్తి కానేకాడన్నారు.
అక్షరఫలకంపై బాబావారి వ్రేళ్ళు కదులుతుంటే,
ప్రక్కనే నిలబడి చదువుతున్న కిట్టీకి కొండంత ధైర్యం వచ్చింది.
దేముడు, దర్శనం, మధ్యవర్తి, భక్తి, మొదలైన విషయాల చెప్పాలంటే గంటకి పైనే పడుతుంది.
ఇప్పుడు కాదు మరోసారి చెప్తాను వివరంగా, అన్నారు బాబా.
అలా, ఆ ప్రకారంగా మెరిడిత్ దాష్టీకంపై తెర దించారు బాబా.
మెరిడిత్‌కి ఇష్టంలేకున్నా,
బాబావారు బీచ్‌లో పచార్లు చేస్తున్నారు.
చుట్టుప్రక్కల కొండ శిఖరాలు ఎక్కుతున్నారు.
ఆశ్రమంలో వుంటున్న భక్తులతో ఎక్కువ సేపు గడుపుతున్నారు.
వాళ్ళతో పచార్లు చేయటమే కాదు
జిల్లా, కిట్టీ, కెన్నెత్ రోస్, ఆలీలతో రకరకాలు ఆటలు ఆడుతున్నారు కూడా.
బాబావారి సహవాసంతో పునీతలవుతున్నారు అందరూ.
డీవెన్‌షేర్ ఆశ్రమంలో బాబా వారు మొత్తం పదిరోజులు వున్నారు.

బయటవాళ్ళకి దర్శనం ఇవ్వలేదు సరికదా,
ఆశ్రమానికి బాబా వారి రాకని గోప్యంగా వుంచమన్నారు.
అయితే ఆశ్రమవాసుల బంధువులు దర్శనానికి వస్తామంటే
వాళ్ళని బాబావారు నిరాశపరచలేదు.
అలానే బాబా భక్తులకి తెలిసినవారు మాకూ కావాలి దర్శనం అని అంటే నిరాకరించలేదు.
సృష్టి, పునర్జన్మ, భగవత్ సాక్షాత్కారం గురించి
బాబావారు వివరించారు ఒకరోజున. సుదీర్ఘమైన వివరణ అది.
వొక పట్టాన ఎవరికైన బుర్రకెక్కని అంశాలు ఇవి.
సాక్షాత్తూ భగవంతుడే వివరిస్తే! ఇంతకంటే ఇంకేమి కావాలి!
ఆనాటి శ్రోతలు ఎంత అదృష్టవంతులో కదా!
అన్నీ విషయాలనీ కూలంకుషంగా వివరించాక బాబా వారొకమాట అన్నారు.
ఈ విషయాలతో తలనొప్పి తెచ్చుకోవద్దన్నారు.
మీకు తెలియాలనే సృష్టి రహస్యం, పునర్జన్మ, భగవత్ దర్శనం గురించి చెప్పామన్నారు
వాటి గురించి బుర్ర బద్దలు చేసుకోకండి అని హితవు పలికారు.
సాధకుడికి కావాల్సింది భగవత్ప్రేమ వొక్కటేనన్నారు.
పరాత్పరుని కోసం పరితపించే ప్రేమ
సాధకుడిని ముందుకు తీసుకువెడ్తుంది అన్నారు.
ఉన్నతోన్నతమైనది ప్రేమ.
దేముడిగురించి ఎంతగా చదివినా
ఫలితం శూన్యం అన్నారు.
ఎన్ని ఉపన్యాసాలు వినినా దండగేనన్నారు.
ఆధ్యాత్మిక పద్ధతుల్ని ఎంతగా ఔపోసన పట్టినా
ముందుకు అడుగు పడదు జ్ఞానమార్గంలో అన్నారు.
జ్ఞానం అన్నింటికీ అతీతమైనది, భిన్నమైనదీ అన్నారు.
జ్ఞాన సముపార్జన అదే భగవద్దర్శనం
ప్రేమ ద్వారానే దొరుకుతుంది అని ఘంటాపథంగా చెప్పారు.
సాధకుడు నిశ్చలంగా, నిర్మలంగా, స్వచ్ఛంగా
భగవంతుడిని ప్రేమించాలి, ఆరాధించాలి అన్నారు.
చంచలత్వం కూడదన్నారు. ఎంత ధృడంగా వుంటే అంత మంచిదన్నారు.
అమ్మో! అంత కష్టమా జ్ఞానమార్గం, అనిపించింది శ్రోతలకి!

**–సశేషం**

# కె.గోపాలపురంలో బాబా జన్మదినోత్సవాలు

పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్లకు సమీపంలోని కె. గోపాలపురం బాబా కేంద్రంలో అవతారుని జన్మదినోత్సవాలు 2020 అక్టోబరు 22న ప్రారంభించినట్లు కేంద్ర కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. బాబావారి జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా ప్రతిరోజూ సాయంత్రం స్థానిక బాబా కేంద్రంలో సాయంత్రం 7 నుండి 8 వరకూ సత్సంగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలను 2021 ఫిబ్రవరి 25 వరకూ తమ కేంద్రం తరపున గోపాలపురం గ్రామంలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్..7799621255 సంప్రదించగలరు.

# ఏలూరు కేంద్ర 68వ వార్షికోత్సవం

ఏలూరు బాబా కేంద్ర 68వ వార్షికోత్సవం 2020 డిసెంబరు 25న ఉదయం 10 నుండి 12.15 వరకూ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ సూరపునేని రాజా ఒక ప్రకటనలో తెలిపారు.

# భీమిలి కేంద్ర 30వ వార్షికోత్సవం

భీమిలి బాబా కేంద్ర 30వ వార్షికోత్సవం 2020 అక్టోబరులో ఆన్‌లైన్‌లో శ్రీ మెహెర్ సుధాకర్ యూట్యూబ్ చానల్ ద్వారా నిర్వహించినట్లు శ్రీమతి రమ ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు ప్రేమికులు అవతారుని సందేశాలపై ప్రసంగించారు. భజన గీతాలాపన చేశారని, కడు రమ్యంగా మూడు విడతలలో కార్యక్రమాన్ని ప్రసారం చేశామని ఆమె అన్నారు.

# తణుకు కేంద్ర 21వ వార్షికోత్సవం

తణుకు బాబా కేంద్ర 21వ వార్షికోత్సవం 2020 నవంబరు 15, సాయంత్రం 5 నుండి ఆన్‌లైన్‌లో శ్రీ మెహెర్ సుధాకర్ యూట్యూబ్ చానల్ ద్వారా నిర్వహించినట్లు స్థానిక నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

# మెహెరాబాద్ తెలుగు-గుజరాతీల సహవాస్

## 1958 ఫిబ్రవరి 21 నుండి 26 వరకూ

ఆ పిదప, రామలింగ శాస్త్రి అనే తెలుగు ప్రేమికుడు బాబా దర్శనం కోసం రాగానే,
నేను ఈతడ్ని **"బాబా శాస్త్రి"** అని పేరుపెట్టానని బాబా చమత్కరించారు.
ఈయన చిన్నతనం నుండి సాధుసజ్జనుల దర్శనానికి వెళ్ళేందుకు ఇష్టపడేవాడన్నారు.
నా దర్శన కార్యక్రమం ఎక్కడవున్నా ఈతను హాజరవుతున్నాడంటూ
ఇటీవల సాకోరి, హమీపూర్ దర్శన కార్యక్రమాలకు ఈతను వచ్చాడన్నారు బాబా.
ఆనాటి సహవాస్‌లో దర్శన కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు ముగిసింది.
బాబాకు ఆరతి పట్టి, ఆనాటి కార్యక్రమం ముగిసినట్లు ప్రకటించారు.
అనంతరం బాబా తన మండలివారితో కొద్దిసేపు ముచ్చటించి,
మెహెరాజాద్‌కి కారులో బయల్దేరారు.
ఆ మర్నాడు ఫిబ్రవరి 23, ఆదివారం ఉదయం 8.15కల్లా
బాబా మెహెరాబాద్‌కి విచ్చేశారు.
కొద్దిసేపు మండలివారితో మాట్లాడి,
ఉ.9.15కల్లా సహవాస్ వేదిక ప్రాంగణానికి విచ్చేశారు.
అప్పటికే సాకోరి నుండి వచ్చిన గోదావరిమాయి
వేదికపై వచ్చి కూర్చుని వున్నారు. ముందుగా ఆమె బాబా దర్శనం చేసుకున్నారు.
ఆ తర్వాత కొద్దిసేపు భజన గీతాలాపన, ఆరతి గానం చేశారు.
అనంతరం, కాకినాడ నుండి సహవాస్‌కి హాజరయిన
మొసలికంటి తిరుమలరావు గారిని వేదికపైకి పిలిచి,
ఇంగ్లీషులో వున్న కొన్ని ప్రకటనలను తెలుగులో చెప్పమన్నారు.
ఆపై అవతారుడు సహవాసీలకు గోదావరిమాయిని పరిచయం చేశారు.
ఆమె గొప్పతనం గురించి మీకు తెలియజేయాలనుకుంటున్నానన్నారు.
ఆమె గురించి అంతక్రితం వారం జరిగిన సహవాస్‌లో చెప్పిన
పరిచయ వాక్యాలను ఏరుచ్ చదివి వినిపిస్తాడన్నారు.
ఏరుచ్ అలా చదవడం పూర్తయ్యాక,
**"గోదావరిమాయికి జై"** అంటూ సహవాస్ ప్రాంగణం మారుమ్రోగింది.

ఆంధ్రా ప్రేమికులు భజన గీతాలు పాడారు.
ఆ తర్వాత రావ్‌సాహెబ్ అఫ్‌సారిని వేదికపైకి రమ్మనమన్నారు బాబా.
ఆయన్ని పర్షియా భాషలో వున్న హాఫీజ్ సూక్తి నొకదాన్ని
చదివి వినిపించమన్నారు బాబా.
ఆ పిదప హాఫీజ్ సూక్తిని ఇంగ్లీషు, గుజరాతి, తెలుగులలో అనువదించారు.
**తెలుగులో హాఫీజ్ సూక్తికి అర్థం ఇలా వుంది.**
**"ప్రకృతి సహజమైన నీ సహజ గుణాలను వదలకుండా,**
**సత్యమార్గాన నీవెలా ప్రయాణించగలవన్నాడు" హాఫీజ్.**
ఆపై బాబా ఇలా అన్నారు.
భగవంతుడిని చేరుకునే సత్యమార్గం చాలా కష్టమైంది.
మాటల్లో చెప్పనలవికాని, భరించలేని కష్టాలు ఈ మార్గంలో అనేకం వుంటాయి.
నిరంతరం భగవంతుని ధ్యాసలో వుండే యోగులు, సాధువులు వంటి వారు కూడా
భగవంతుని నిజస్థితిని అర్థం చేసుకోలేరు.
అందుకే, ప్రకృతి సహజమైన మీ సహజ గుణాల నుండి
మీరు బయటకు రావాలని హాఫీజ్ ప్రభోదించాడు.
ఐతే, ఆ ప్రకృతి సహజమైన గుణగణాలు ఏమిటి? అని ప్రశ్నించిన బాబా,
మానవ చైతన్యము, సృష్టి పరిణామక్రమం గురించి
తానిప్పుడు చెప్పడం లేదన్నారు.
వీటి గురించి చాలా పుస్తకాల్లో విస్తారంగా వివరించానన్నారు.
ప్రకృతి సహజమైన గుణగణాలు గురించి సోదాహరణంగా బాబా ఇలా అన్నారు.
ఉదాహరణకు ఓ పసికందు పుట్టడంతో ప్రారంబిద్దామన్నారు.
ఆతని లేదా ఆమె గతజన్మ సంస్కారాల ఫలితంగా జన్మఎత్తడం జరుగుతుంది.
భూమ్మీద పుట్టిన మరుక్షణం నుండి అతను లేదా ఆమె
తమ గత జన్మల్లో ప్రోదిచేసుకున్న సంస్కారాలను అనుభవించడం ప్రారంభమౌతుంది.
అంటే ఆ పిల్లవాని ప్రవర్తన ఎలా వుంటుంది? అని బాబా ప్రశ్నిస్తూ,
ఆతను లేదా ఆమె ప్రవర్తన గత జన్మలోని మానసిక సంస్కారాలను బట్టి
వుంటుందని బాబా అన్నారు. ఆ పిల్లవాడు మాటల్లో, చేతల్లో
గత జన్మ సంస్కారాల ప్రభావంతోనే ప్రవర్తిస్తాడు.
అంతకుమించి వారికి మరోమార్గం లేదు.
గతజన్మ సంస్కారాలను అనుభవించాల్సిందే.
ఇది తప్పదన్నారు.

**THAT IS THE LAW OF MUST.**

గతజన్మ సంస్కారాల ప్రభావంతోపాటు,
అతని చుట్టుప్రక్కల వున్న పరిస్థితులు కూడా
ఆతను లేదా ఆమె తమ మాటల్లో, చేతల్లో నడవడిలో
గతజన్మ సంస్కారాల ప్రకారం ప్రవర్తించడానికి సహాయపడతాయి.
ఈ భూమ్మీద పుట్టిన ప్రతిఒక్కరూ రోజురోజుకీ పెరిగి పెద్దవారౌతారు.
జన్మతీసుకోగానే బిడ్డ, అది మగపిల్లవాడు కాని, ఆడపిల్ల కానీ కెవ్వున ఏడుస్తుంది.
వారికి ఆహారంగా పాలు ఇస్తారు.
ఆపై వారికి నామకరణం చేస్తారు.
ఆ పిల్లల ప్రవర్తన, ఇష్టాయిష్టాలు ఇతరత్రా అన్నీ కూడా
వారి గతజన్మ సంస్కారాలకి ప్రకారమే వుంటాయి.
ఆ పిల్లలకు, వారెక్కడ నుండి వచ్చారో వారికి తెలియదు.
వారికి ఆ ఆలోచనే వుండదు.
ఆ పిల్లలకు తెలిసిందల్లా
తాము జన్మించామన్న ధ్యాసలో జీవిస్తారు.
ఆపై వారు తింటూ, తిరుగుతూ, చదువుకుంటా,
ఆనందిస్తూ, కష్టాల్లో బాధపడుతూ జీవితం వెళ్ళదీస్తారు.
ఇదంతా వారి **"స్వభావం"** (nature).
ఇక్కడ NATURE అంటే ప్రకృతి కాదు.
హాఫీజ్ చెప్పింది ఈ సహజ స్వభావం గురించి మాత్రమే !!
ఇదంతా తప్పక అనుభవించాల్సిందే.
THE LAW OF MUST.
ఈ స్వభావమే మిమ్మల్ని స్త్రీలని, లేదా పురుషులని,
నీవు ఆరోగ్యవంతుడవని లేదా రోగివి,
అందగాడివి లేదా అందవికారివి,
ఇలా అనేక ఆలోచనలను మీలో మీకు రేకెత్తిస్తుంది.
ఇక మనం ఆధ్యాత్మికపథంలోని కష్టాల విషయంలోకి వద్దాం.
అసలు కష్టాలు అంటే ఏమిటి?
ఆధ్యాత్మికపథంలో "నా నిజస్థితిని" తెలుసుకోవడం అసాధ్యమైనది.
ఎందువల్ల అసాధ్యమో, అందుకు గల కారణాలను
నేనిప్పుడు వివరిస్తానని బాబా ఇలా అన్నారు.

హఫీజ్ ఏం చెప్పాడు? నీ స్వభావం నుండి బైటపడమని సూచించాడు కదా!!
అంటే, నీ స్వభావానికి భిన్నంగా ప్రవర్తించమని హఫీజ్ సూచించాడు.
నీ స్వభావం ఏం చెప్తుంది. నీకు ఆకలిగా వుంది.
ఏదైనా ఆహారం అవసరమని సూచిస్తుంది.
ఆ పిదప ఆహారం కోసం వెదికి కడుపారా భోజనం చేస్తావ్.
ఐతే హఫీజ్ ఏం చెప్తాడంటే, నీకు ఆకలిగా వున్నప్పుడు ఎలాంటి ఆహారం
తీసుకోవద్దంటాడు. అదేవిధంగా, నీకు ఆకలిగా లేకపోయినా,
విపరీతంగా ఆహారం తీసుకొనే ప్రయత్నం చేయమన్నాడు.
నీకు నిద్రపోవాలనిపిస్తుంటే, నిద్రపోకుండా జాగరణ వుండమన్నాడు.
అదే మీ సహజ స్వభావానికి విరుద్ధంగా ప్రవర్తించడం అన్నారు.
ఇదే మీ స్వభావం నుండి బైటపడటమన్నారు బాబా.
ఈ విషయాల్ని హజీజ్ ద్విపదలో గమనించాలన్నారు బాబా.
ఇది సరైన వివరణేనా? అని బాబా ప్రశ్నిస్తూ,
హఫీజ్ ఉద్దేశ్యం ఏమిటో ఇంకా వివరంగా చెప్తానని బాబా ఇలా అన్నారు.
హఫీజ్ ప్రకారం, నీకేదైనా చూడాలనిపిస్తే దాన్ని చూడొద్దు.
అదే సమయంలో నీకేది చూడాలనిపించకపోతే,
దాన్ని చూడటం ప్రారంభించు. ఇదీ హఫీజ్ సూచించింది.
మీ సహజ స్వభావం నుండి బైటపడమంటే ఇదే అనుకుందాం.
ఇలా ఇంకా అనేక ఉదాహరణలు ఈ విషయమై ఇవ్వొచ్చు.
ఏదైనా ఎత్తైన కొండ ఎక్కాల్సివస్తే, కొంత ఎత్తు ఎక్కాక
నీకు ఎక్కువ ఊపిరి తీసుకోవల్సి వస్తుంది.
ఐతే సాధారణ ఉచ్ఛ్వాస నిశ్వాసలే కాని
అధికంగా శ్వాస తీసుకోవద్దంటాడు హఫీజు.
సాధారణంగా గాలిపీల్చాల్సిన సమయంలో, గట్టి ఒత్తిడితో శ్వాస తీసుకోమంటాడు.
ఇవన్నీ మీ స్వభావం నుండి బైటపడటం అని హఫీజ్ సూచించాడు.
ఐతే ఇదంతా పాటించడం చాలా కష్టం.
మీ స్వభావం నుండి బైటపడటం చాలా కష్టం.
అందుకే మీరు నా నిజస్థితిని దర్శించడం చాలా కష్టం అన్నారు బాబా.
ఐతే మరేం చేయాలి? మరో మార్గం ఏమైనా వున్నదా? అంటే,
హఫీజ్ ఒక చక్కని మార్గాన్ని సూచించాడన్నారు.

ఐతే ఇది కూడా కష్టమైనదే.

గతంలో చెప్పినదానంత కష్టం కాదు కానీ కష్టమైనదే. కొద్దిగా సులువైనదే ఇది. హాఫీజ్ ఏం చెప్పాడంటే అంటూ పర్షియన్ భాషలో వున్న హాఫీజ్ సూక్తినొకదాన్ని రావ్‌సాహెబ్‌ని వేదికపైకి వచ్చి బిగ్గరగా చదవమన్నారు.

అనంతరం దాన్ని ఇంగ్లీషు, తెలుగు, గుజరాతీలలో అనువదించారు.

**"ఓరి పిచ్చివాడా!!**

**నీకు భగవంతుడిని గురించి తెలుసుకోవాలనే పిచ్చి కనుక వున్నట్లయితే, సద్గురు పాదాలకింద ధూళిగా మారిపోవాలి". ఇదీ హాఫీజ్ సూచన అంటూ...**

బాబా తన ప్రసంగం కొనసాగించారు. సద్గురువు పాదాల క్రింద ధూళిగా మారడమంటే ఏమిటో వివరిస్తూ ఇలా అన్నారు. హాఫీజ్ అన్నది ఏమిటి?

ధూళి కణాలకు తమకంటూ ఏమీ ఆలోచన వుండదు. దానికంటూ ప్రత్యేక కోరికలు ఏవీ వుండవు. పాదాలకింద తొక్కినా, నుదిటికి రాసుకున్నా, గాలిలో విసిరినా, ధూళికి బేధం ఏం వుంటుంది? పాదధూళిగా మారడం అంటే సద్గురువుకి సంపూర్ణ విధేయుడిగా వుండటమేనని బాబా వివరించారు. ఈ విషయంలో ఇంకా ఎవరికైనా అర్థం కాకపోతే, ఏమీ బాధపడకండి. నాకేసి చూస్తూ కూర్చోండి. నా గురించి ఆలోచిస్తుండండి. అంతమాత్రం చాలు. మాటలకు విలువ లేదు. మీకు అర్థమయితే మంచిది. అర్థం కాకపోతే చింతించడం ఏల? అన్నారు బాబా.

**విధేయత అంటే ఏమిటి? అనే ప్రశ్నకు జవాబిస్తూ,**

**బాబా తన సందేశాన్ని ముగించారు.** గతవారం మెహెరాబాద్‌లో జరిగిన సహవాస్ సమయంలో బాబావారిచ్చిన నాలుగు రకాల విధేయత అనే అంశంపై ఏరుచ్‌ని చదివి వినిపించమన్నారు. ఇదే సందేశాన్ని బాబా గతంలో పూణే, ముంబాయిలలో కూడా ఇచ్చారు. చివరిగా, రావ్‌సాహెబ్‌ని మరో పర్షియన్ కవి చెప్పిన ద్విపదను చదివి వినిపించమన్నారు. అనంతరం ఆ కవితను ఇంగీషు, గుజరాతి, తెలుగులో అనువదించారు. ఆ కవితకు తెలుగుసేత ఇలా వుంది.

**"ఎన్నో సంవత్సరాలు దేవుని కోసం ఎదురు చూసిన కొన్ని వేలమందిలో**
**ఏ ఒక్కరో దేవుని దరి చేరగల్గుతారు.**
**అలా దేవుని దరి చేరిన లక్షలాదిమందిలో ఏ ఒక్కడో,**
**ఎవరైతే తన కోసం జీవించక, భగవంతునికి సర్వార్పణ అవుతారో,**
**అలాంటి వాడొక్కరు భగవదైక్యం సాధిస్తారు".**

దీంతో మీకు భగవదైక్యం అంటే ఎంత కష్టమో అర్థమయ్యిందా? అన్నారు బాబా. తమ కోసం కాకుండా, దేవుని కోసం జీవించే కొన్ని లక్షలాది మానవుల్లో ఏ ఒక్కరో భగవదైక్యం సాధిస్తారని బాబా స్పష్టం చేశారు.

**-సశేషం**

# కాదంటారా?

బాబా ప్రేమికుడైన ఢాకేఫాల్కర్ అహ్మద్‌నగర్ నివాసి. వృత్తిరీత్యా గొప్ప న్యాయవాది. 1920వ దశకం నుండి మెహెరాబాద్‌లో బాబావారితో వున్నాడు. ఇన్ ది కంపెనీ ఆఫ్ గాడ్ పేరిట ఆయన రాసిన స్వీయరచనలో (పేజి 46లో) ఢాకేజీ తన స్వగతం ఇలా చెప్పారు. ఇకపై ఆయ మాటల్లోనే మెహెర్‌బాబా పాఠకుల కోసం ప్రత్యేకంగా ప్రచురిస్తున్న ఈ కథనంపై దయచేసి స్పందించ గలరు.

****

ఓ రోజున నా స్నేహితులు ఇద్దరు అహ్మద్‌నగర్ నుండి సుమారు 40 కిమీ దూరంలో వున్న రాహూరి గ్రామానికి వెళ్ళాలని మా ఇంటికి వచ్చారు. నన్ను కూడా వారితో రాహూరికి రావాలని పట్టుపట్టడంతో ముగ్గురం బస్సులో బయల్దేరాం. నా కనీస మర్యాదగా మా ముగ్గురికి బస్ టిక్కెట్లు నేనే కొన్నాను. రాహూరీలో మా పని పూర్తయ్యింది. తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాం. బస్సు కోసం ఎదురు చూస్తూ, జేబులో పర్సు చూసుకుంటే బస్సు టిక్కెట్‌కి ఇద్దరికి సరిపడ మాత్రమే డబ్బులున్నాయి. మూడోవానికి డబ్బు తక్కువయ్యింది.

**(ఆ రోజుల్లో మనలో కూడా చాలామందిమి ఈ అనుభవాన్ని చవి చూసినవారమే)**

నాకు దిక్కుతోచలేదు. కళ్ళు మూసుకుని, మనస్సులో బాబా చిత్రాన్ని వుంచి, బాబా నన్ను ఎలాగైనా ఈ కష్టం నుండి ఆదుకోమని వేడుకున్నాను.

నాకు మరోమార్గం కనపడలేదు. చాలా బాధగా వుంది. మనస్సు చివుక్కుమంది. బాబా నన్నెలా కాపాడతాడోనని ఎదురుచూస్తున్నాను. ఇంతలో బస్సులో నుంచి నన్ను చూసిన ఒక రైతు వేగంగా బస్సుదిగి నాకు నమస్కరించాడు.

అతను నా క్లయింట్ అని గుర్తుపట్టాను.

“అయ్యా, నేను మిమ్మల్ని కలవాలనే అహ్మద్‌నగర్‌కు వస్తున్నాను.

మిమ్మల్ని ఇక్కడ చూసి దేవుడు నాకు సహాయం చేశాడనిపించింది.

అహ్మద్‌నగర్ దాకా రాకుండా ఇక్కడే నా పని అయ్యేలాగా చేశాడంటూ,

తన బస్ టిక్కెట్ నాచేతికి ఇచ్చాడు. తన కోర్టు కేసుకి సంబంధించి సంతకం చేసిన వకాల్తా పేపర్లు నాచేతికి ఇస్తూ, నా ఫీజు మొదటి వాయిదా అంటూ 25 రూపాయలు నా చేతిలో పెట్టి మరోమారు నమస్కరించాడు. మీరు రాహూరిలో కనపడటంతో, నాకు చాలా టైం కలిసొచ్చింది. అంతా బాబా దయ అంటూ”, శెలవ్ తీసుకున్నాడు. ఇంతలో బస్సు బయల్దేరుతున్న సంకేతాలు రావడంతో, ముగ్గురం బస్సులోకి ఎక్కాం. నా కళ్ళలో నీళ్ళు చెమ్మగిల్లాయి. మనస్సు ఆర్ద్రమైంది.

కృతజ్ఞతలతో బాబాకు మనస్సులోనే రెండు చేతూలూ జోడించాను.
ఐతే, ఇంత చిన్న విషయానికి బాబాని డిస్టర్బ్ చేశానని చాలా బాధపడ్డాను.
ఇంత చిన్నపాటి విషయానికి బాబాను పరీక్షకు గురిచేసుండాల్సింది కాదు.
ఆయన ఎల్లవేళలా నాకు అండగా వున్నాడు.
మరోమారు ఇలాంటి పని చేయనని చెంపలేసుకున్నాను.
అహ్మద్‌నగర్ వైపు బస్సు వేగంగా బయల్దేరింది.
నా మనస్సు మనస్సులో లేదు. ఎక్కడో వున్నాను.
బాబా నాతో ప్రయాణిస్తున్నట్లు, ఆయన నాకు తోడూ నీడగా
వున్నాడనే అనుభూతిలో తేలిపోతున్నాననిపించింది.
ఢాకే గారికే కాదు. ఈ మాదిరి అనుభూతులు..అనుభవాలూ .ప్రతి బాబాప్రేమికులకి అనునిత్యం సర్వసాధారణం.
**కాదంటారా?**

# శ్రీమతి యన్. సూర్యాకాంతం



శ్రీ యన్‌వివి సత్యనారాయణ గారి భార్య శ్రీమతి సూర్యకాంతం అక్టోబరు 31న స్వల్ప అస్వస్థతతో బాబాలో ఐక్యమయ్యారు. 1962లో ఆమె మెహెర్‌బాబాని దర్శించుకున్నారు. తనను కలిసివారితో ఎప్పుడూ నవ్వుతూ, ప్రేమతో పలకరించే సూర్యాకాంతం గారిని బాబా ప్రేమికులు ఎన్నడూ మరచిపోలేరు. ఆమె ఎన్నడూ ఆసుపత్రికి వెళ్ళడం ఎరుగరని, తన 77వ ఏట 2020 అక్టోబరు ఆఖరి వారంలో హైదరాబాద్‌లో తొలిసారిగా ఆసుపత్రిలో చేరిన మూడవ రోజుననే తుదిశ్వాస విడవడవం జరిగిందని ఆమె కుమారుడు శ్రీ ప్రసాద్ తెలిపారు. నవంబరు 11న హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో బాబా సత్సంగ్ నిర్వహించామని శ్రీ ప్రసాద్ తెలిపారు. అవతారుడ్ని పలుమార్లు దర్శించుకున్న శ్రీ యన్‌వివి సత్యనారాయణ (99632 66156) “ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. ఓ మంచి వ్యక్తిగా, ప్రేమించగల్గేవారిని ప్రేమిస్తూ, చేతనైనంత సహాయం అందజేస్తూ ఆనందంగా జీవనం గడపడమే బాబా ప్రేమికులుగా మన కర్తవ్యం” అని గుర్తుచేశారు.

# మెహెర్‌బాబా ఇష్టపడిన ఫోటో




**దర్బార్ ఫోటో.**

మెహెర్‌బాబా ప్రేమికులందరి ఇళ్ళలో ఈ ఫోటో తప్పక వుంది. ఈ చిత్రంలో మెహెర్‌బాబా ఎంతో హుందాగా, రాచ ఠీవీతో కూర్చుని వున్నారు. ఈ చిత్రంలో బాబావారి పాదాలు స్పృశిస్తున్నామనే తృప్తి లభిస్తుంది. దర్బారు ఫోజు ఫోటోని బాబా భక్తులే కాదు, మెహెర్‌బాబా కూడా బాగా ఇష్టపడేవారు. 1960 ప్రాంతంలో మెహెర్‌బాబా గురుప్రసాద్‌లో, పూణే నగరంలో వున్న ఓ ప్రఖ్యాత ఫోటోగ్రాఫర్, శ్రీ రీగే ఈ ఫోటోని తీశాడు. దీనికి ముందు ఒక చక్కని కథ వుంది. అదంతా తన వల్లనే జరిగింది కాబట్టి, అదేదో వివరంగా తెలియజేస్తానన్నారు మండలి సభ్యుడైన శ్రీ బాలనాటు. దయచేసి ఆలకించండి!!

****

1958 వేసవిలో మెహెర్‌బాబా పూణేలోని గురుప్రసాద్‌లో వున్నారు.
నేను కురుద్వాడి అనే గ్రామంలో స్కూలు టీచర్‌గా పనిచేసేవాడిని.
షోలాపూర్‌కు దగ్గర్లో వుంది మా గ్రామం కురుద్వాడి.
ఒక సందర్భంగా మా స్కూలుకు వరుసగా ఆరు వారాలు సెలవులు ఇచ్చారు.
ఆ సమయంలో బాబా సమక్షంలో గడిపేందుకు నాకు అనుమతించారు.
బాబా దగ్గర వున్నప్పుడు రోజూ బాబాకు వచ్చే ఉత్తరాలలో, మారాఠీలో రాసిన వుత్తరాలను బాబా ఎదుట చదివి, తిరిగి బాబావారి సూచనల మేరకు వారికి జవాబులు పోస్టుచేసే బాధ్యత నాకు అప్పగించారు.
ఇంగ్లీషులో వచ్చిన ఉత్తరాలను ఏరుచ్ బాబాకు చదివి వినిపించేవాడు.
ఓ రోజున శ్రీ రీగే, పూణే ఫోటోగ్రాఫర్ నుండి ఒక పోస్టుకార్డు వచ్చింది.

ఆ లేఖలో అతను తానొక గొప్ప ఫోటోగ్రాఫర్‌ననీ, ఇప్పటికే చాలామంది
వి.వి.ఐ.పి.లకు ఫోటోలు తీసిన అనుభవం తనకుందని రాశాడు.
తనకొక అవకాశం ఇస్తే మెహెర్‌బాబా ఫోటోను అందంగా తీస్తానని
అతను లేఖ రాశాడు. ఆ రోజుల్లో బాబా నాకొక మంచి అవకాశం ఇచ్చారు.
అదేమంటే బాబాకు వచ్చిన ఉత్తరాల్లో నుండి నాకు ఇష్టమైన కొన్ని ఉత్తరాలు మాత్రమే
చదివి వినిపించే స్వేచ్ఛ బాబా నాకిచ్చారు. ఇది బాబా నాకిచ్చిన ఒక విశేషాధికారం.
శ్రీ రీగే రాసిన లేఖను చదివాక, నాకెందుకో ఆ లేఖలోని సారాంశం నాకు నచ్చలేదు.
నాకెందుకో ఆ లేఖను బాబా ఎదుట చదవడానికి ఇష్టపడలేదు.
ఆ లేఖలో ఏదో తెలియని గర్వం తొణికిస లాడిందనిపించింది.
దాంతో ఆ లేఖను చదవకూడదనుకున్నాను.
నా దగ్గరున్న వాటిలో అన్నింటికంటే అట్టడుగున వుంచాను.
ప్రతిరోజూ బాబా నాచేత రెండు, మూడు ఉత్తరాలు చదివించుకుని,
ఆపై ఇక చాలని సంజ్ఞలు చేసేవారు.
ఆ మాదిరిగా శ్రీ రీగే లేఖ బాబా కంటపడదనుకున్నాను.
ఆ మర్నాడు ఉత్తరాలు చదివే సమయంలో ఏరుచ్ తన దగ్గరున్న
ఇంగ్లీషు ఉత్తరాలన్నింటినీ బాబాకు చదివి వినిపించాడు.
ఆ రోజు ఎందుకో, ఏరుచ్ దగ్గర చాలా తక్కువ ఉత్తరాలున్నాయి.
అతని పని త్వరగా ముగిసే సరికి, బాబా నాకేసి చూశారు.
మరాఠీ లేఖలు చదవమన్నట్లు సంజ్ఞ చేశారు.
వచ్చిన ఉత్తరాలలోని సారాంశం చెబితే,
బాబా వాటికి జవాబు ఏం రాయాలో సంజ్ఞలు ద్వారా సూచించేవారు.
ఆ రోజున ఎందుకో బాబా చాలా సంతోషంగా వున్నారు.
హుషారుగా, ఆనందంగా వున్నారు.
దాంతో నా చేతిలో వున్న ఉత్తరాలన్నింటినీ
ఒకదాని తర్వాత మరొకటి చొప్పున చదవమన్నారు.
నేను ఒకొటొకటే చదువుతూ వుంటే,
ఇంకా..., ఇంకా..., అని బాబా అంటుంటే,
చివరాఖరులో వుంచిన శ్రీ రీగే ఉత్తరం కూడా చదవాల్సి వచ్చింది.
విచిత్రం! నాకీ పరిస్థితి ఎదురౌతుందని నేను ఊహించలేదు.
శ్రీ రీగే ఉత్తరాన్ని చదవకూడదనుకున్నాను. కానీ, నా ప్రయత్నం ఫలించలేదు.
రీగే ఉత్తరాన్ని పూర్తిగా కాకుండా, ఆ ఉత్తరంలోని సారాంశాన్ని చదివి వినిపించాను.
ఆ సారాంశం చదివే రీతిలో కూడా **“నాకు నచ్చలేదు”** అన్న ధోరణిలోనే చదివాను.

బాబా కూడా నా అభిప్రాయంతో అంగీకరిస్తారనుకున్నాను.
కానీ, అలా జరగలేదు. ఆ ఉత్తరాన్ని ఆసాంతం చదవమన్నారు.
నేను చదవడం పూర్తికాక మునుపే,
బాబా ఏమన్నారనుకున్నారు..బాబా నాకేసి చూస్తూ...
**That's fine! When should we call him?**
అంతా బాగుంది. ఐతే అతడ్ని ఎప్పుడు పిలుద్దాం? అన్నారు.
దాంతో ఆశ్చర్యపడటం నావంతైంది.
ఏదైనా ఒక తారీఖు ఖరారు చేయమన్నారు.
అతను వచ్చినపుడు అవసరమైన అన్ని ఏర్పాట్లు నన్నే చూడమన్నారు బాబా.
నేను ఖంగుతిన్నాను.
మరేం చేస్తాం. శ్రీ రీగేను పూనే గురుప్రసాద్‌కు ఆహ్వానిస్తూ ఉత్తరం రాశాను.
శ్రీ రీగే ఫోటో తీసుకునేటప్పుడు కూడా బాబా చాలా సంతోషంగా కనిపించారు.
అతను అడిగిన ప్రతి చిన్న విషయానికి బాబా సంతోషంగా అంగీకరించారు.
నాకు తెలిసి, బాబా ఎన్నడూ ఏ ఫోటోకి ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదు.
ఈ చిత్రానికి ఫోజు ఇస్తూ కూడా బాబా నాకేసి క్రీగంట చూశారు.
ఆ చూపులో నాకు అనేక అర్థాలు స్ఫురించాయి.
ఫోటోగ్రాఫర్ మొత్తం 5 రకాల ఫోటోలు తీశాడు.
ఆ రోజుల్లో ఫోటో తీసుకోవడమంటే, నేటి మాదిరి కాదు కదా!
అదొక బృహత్తర ప్రయత్నం. గడ్డు రోజులవి!!
ఓ వారం రోజుల్లో, మనం నేడు చూస్తున్న "దర్బార్ ఫోటోని" శ్రీ రీగే తీసుకొచ్చాడు.
ఈ సంఘటన నాకొక కనువిప్పు.
అంతా నాకు తెలుసుననే గర్వం కూడదని బాబా సున్నితంగా నన్ను హెచ్చరించారు.
అంతేకాదు, అవతారునికి అవగతం కానిది
ఏమీలేదని చెప్పకనే నాకు తెలియజెప్పారు.

***

# లిఖిత మాస పత్రిక

శ్రీ బండవరం రంగనాథస్వామి, మంచిర్యాల (98499 22141) వారి సంపాదకత్వంలో మెహెర్‌బాబా లిఖిత మాస పత్రిక 1980 వ దశకం నుండి సుమారు 8 సంవత్సరాలకు పైగా నిర్విఘ్నంగా ప్రచురించారు. శ్రీ బండవరం తన స్వదస్తూరీతో అవతారుని సమాచారం ఎంతో ఆసక్తికరంగా బాబా ప్రేమికులెందరికో అందజేశారు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

**RNI No. APTEL/2002/7310, Postal Concession: HSE/789/2020-2022 Dt.20-01-2020, Date of Publication 20h of every month, Posted at Patrika Channel on 25 / 26th every month.**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

# జీవిత సభ్యత్వం

**2020 అక్టోబర్ నెలలో పంపిన వారి వివరాలు**

| | | |
|---|---|---|
| 1. | ఎస్. గోవింద రావు, విశాఖపట్నం | 1000/- |
| 2. | ఎన్. మెహెరా, విశాఖపట్నం | 1000/- |
| 3. | ఐ.సీతా రామ స్వామి, విజయనగరం | 500/- |
| 4. | బి.జగదీష్, విజయనగరం | 500/- |
| 5. | యం.సత్యవతి, విజయనగరం | 500/- |
| 6. | యం.సుగుణమ్మ, గరివిడి, విజయనగరం | 500/- |
| 7. | ఎ.లోకేశ్వరరావు, చీపురుపల్లి, విజయనగరం | 1000/- |
| 8. | పొలమూరి వీరబాబు, మండపేట, తూ.గో.జి. | 1000/- |
| 9. | తట్టికొండ రమాదేవి, లక్సెట్టిపేట, మంచిర్యాల్ | 1000/- |
| 10. | పుష్ప, సికింద్రాబాద్ | 1000/- |
| 11. | కృష్ణ ప్రొవిజన్ స్టోర్స్, బెంగళూర్ | 1000/- |
| 12. | బ్రాంచ్ లైబ్రరీ, భీమిలి, విశాఖపట్నం | 1000/- |
| | | **10,000/-** |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**

సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

**మా అడ్రస్:** ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ పోస్టు, సికింద్రాబాద్-500087.
**ఫోన్: 99595-53218. email: malladisukku@gmail.com**